ప్రజాశక్తి సోపతి

సంగీత కళానిధి

డిసెంబర్ 14, 2014 ఆదివారం అనుబంధం

పుస్తకానికి మహర్దశ

- మహేష్ దుర్గే కథ: ప్రియమైన స్త్రీ
- దేవరాజు మహారాజు పుస్తకంపై సమీక్ష
- రైతు జీవన ప్రతీక
- నందకిషోర్, మోహన్‌రుషి కవితలు



ఈ చిత్రకళా తపస్విని గౌరవించుకుందామా?

వేల సంఖ్యలో అద్భుతమైన చిత్రాలు గీసిన చిత్రకళా తపస్వి కొండపల్లి శేషగిరిరావు. ఇప్పటికీ వందలాది చిత్రాలు వారి స్వగృహంలో వున్నాయి. నిజానికి వారి ఇంటిని తెలంగాణ చిత్రకళా మ్యూజియంగా చేయాలి. ఇందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలి. చిత్రకళలో అనేక ప్రయోగాలు చేశారు కొండపల్లి వారు. అంతేగాక తెలంగాణ చిత్రకళా రంగ వికాసానికి ఆయన చేసిన దోహదం అలవికానిది. బొమ్మలు వేయడమే కాదు, చిత్రకళావిమర్శ కూడా చేశారు. తెలుగునాట చిత్రకళా వికాసానికి శేషగిరిరావు చేసిన కృషి అవిస్మరణీయం. ఆర్థికపరమైన ఒడిదుడుకుల్ని అధిగమించి శాంతినికేతన్‌కు వెళ్ళి చిత్రకళను అభ్యసించిన శేషగిరిరావు తర్వాత కాలాన తన జీవితాన్ని చిత్రకళకే అంకితం చేశారు. ప్రాకృతిక, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక పార్శ్వాలు అనేకం వారి చిత్రాల్లో ప్రతిఫలించాయి. అజరామరమైన చిత్రాల్ని సృజించిన కొండపల్లి శేషగిరిరావు ఇల్లు హైదరాబాద్‌లోని దోమలగూడలో వుంది. కనీసం వారు వున్న వీధికి 'కొండపల్లి శేషగిరిరావు వీధి' అని పేరు పెట్టొచ్చు. అలాగే వారి ఇంటిని చిత్రకళా మ్యూజియంగా చేయొచ్చు. ఈ విషయమై తెలంగాణ కళల వికాసానికి పాటుపడతామని చెప్పేవారు చొరవ చూపాలి. కొండపల్లి శేషగిరిరావు గారి జీవితచరిత్రని వారి కోడలు కొండపల్లి నీహారిణి రచించారు. దానిని తెలంగాణ ప్రభుత్వమే పునర్ముద్రించాలి. తెలంగాణలో పాఠశాల సిలబస్‌లో వారి జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేయాలి. మన కళల్ని, మన వాళ్ళ ప్రతిభను గుర్తించి, గౌరవించే సంస్కారం ఉంటే ఎన్నో పనులు చేయడానికి వీలుంది. "మనవాడు మరోదేశంలో పుట్టి ఉంటే మరెన్నో గౌరవ పురస్కారాలు లభించి వుండేవి" అని వగచాల్సిన అగత్యం తెలంగాణలోని సృజనశీలురకు పట్టకూడదు. 'స్వపరిపాలన, ఆత్మగౌరవం' అనే నినాదాలు మాటలకే పరిమితం కానక్కర్లేదు. ఆచరణలో నిగ్గుదేలాలి. విజయనగరంలో గురజాడ ఇంటిని మ్యూజియంగా చేశారు. రాజమండ్రిలో దామెర్ల రామారావు చిత్రాలకు మ్యూజియం వుంది. ఇక్కడ తెలంగాణలో కొండపల్లి శేషగిరిరావుకు అలాంటి గౌరవం దక్కాలంటే తెలంగాణ సాహిత్య, కళారంగాలవారు ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకెళ్ళాలి. కొండపల్లి వారు సృజించిన వందలాది చిత్రాల సంపదను కాపాడుకోవాలి. వారి గొప్పతనం మరుగున పడిపోకుండా ముందుతరాలవారికి అందించాలి. కొండపల్లి శేషగిరిరావు మాత్రమే కాదు కాపు రాజయ్య లాంటి వారికి కూడా ఈ గౌరవం దక్కాలి. ఒకప్పుడు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ దేశంలోనే పేరెన్నికగన్న సంస్థ. చిత్రకళకు సంబంధించి తిరిగి ఆ స్థాయి వైభవాన్ని హైదరాబాద్ అందుకోవాలి. ముంబయిలోని జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో బొమ్మలు ప్రదర్శించడం చిత్రకారులకు అపూర్వ గౌరవం. అలాంటి ఆర్ట్ గ్యాలరీని ఇక్కడ కొండపల్లి శేషగిరిరావు పేరిట నిర్మించుకోవాలి. తద్వారా వారి గౌరవమూ, తెలంగాణ ప్రతిష్ఠ ఇనుమడిస్తాయి.



– గుడిపాటి

■ అంతరంగం

కవిత్వం

తన గీతం జాతిజనులు పాడుకునే మంత్రం కావాలని ఆశించారు శ్రీశ్రీ. అందుకే వ్యాకరణాల సంకెళ్ళ నుంచి, ఛందస్సుల సర్ప పరిష్వంగాల నుంచి కవిత్వాన్ని విముక్తం చేశారు. సామాన్యుల దరిచేర్చారు. కవులు వేలుగా వర్ధిల్లే ఈ కాలాన శ్రీశ్రీని గుర్తు చేసుకోవాలి. నిత్యం తెలుగునాట కవిత్వం అనేక రూపాల్లో ప్రవహిస్తోంది. పత్రికల్లోనూ కాదు, ఫేస్‌బుక్‌ల్లో, మెసేజ్‌ల్లో, ఆన్‌లైన్‌లో కవిత్వం వెల్లువెత్తుతోంది. మరి ఈ కవిత లక్ష్యం ఏమిటి, దాని దశ దిశ ఏమిటని నిర్ణయించుకోకపోతే ప్రమాదంలో పడుతుంది. ఓ కవిత అచ్చు కావడానికి ఆర్నెల్లు కావచ్చు, అసలు అచ్చు కాకపోవచ్చు. ఇది గతం. కానీ ఇవాళ రాసిన క్షణమే అనేకమందితో తమ కవిత్వాన్ని పంచుకునే అవకాశం చేకూరింది. ఫేస్‌బుక్‌లో పోస్టు చేయొచ్చు. మిత్రులకు మెసేజ్‌లు పంపొచ్చు. ఒకేసారి వందలమందికి ఈమెయిల్ చేయొచ్చు. ఈబుక్‌గా చేసి ప్రపంచం మీదకు వదలొచ్చు. ఎవరూ ఆపలేరు. టెక్నాలజీ కవికి ఆ స్వేచ్ఛను ప్రసాదించింది.

ఇలాంటి సన్నివేశంలోనే కవులు తమ కవిత్వానికి తామే పాఠకులై తీర్పరులుగా వ్యవహరించాలి. తమ కవిత్వ లక్ష్యం నిర్ణయించుకోవాలి. దాని ప్రభావం ఏమిటో గమనించాలి. వందల కవితలు రాయొచ్చుగాక రెండు కవితాపాదాలయినా ప్రభావితం చేయలేకపోతే ఆ రాతల ఫలితం ఏమిటి? పురస్కారాలు పొందొచ్చు గాక అటక మీద వెక్కిరించే పుస్తకాల దొంతరలు చెబుతున్న పాఠం ఏమిటో గ్రహించాలి. అచ్చు అన్నది తెలియని రోజుల్లో వేమన, అన్నమయ్యలు ఆశువుగా చెప్పిన కవిత్వం ఇవాళ్టికీ ప్రజల నాలుకల మీద వుంది.

ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినా, పత్రికల్లో వచ్చినా, పుస్తకాలుగా అచ్చువేసి పురస్కారాలు గైకొన్నా అంతిమంగా కవిత్వం కదిలించాలి. లోలోపలి ప్రపంచాల్ని కలవరపరచాలి. ఏ ఒక్కరినీ ప్రభావితం చేయని కవిత ఉత్త అక్షరాల పోగు. అందుకని తమకు ఎన్ని పురస్కారాలు వచ్చాయని కాదు, తమ కవిత్వ ప్రభావం ఎంత అని యోచించాలి. ఎందరో మెచ్చారని కాదు, నిజంగా ఎందర్ని కదిలించిందో ఆలోచించాలి.

ప్రపంచాన్ని, సమాజాన్ని తన కవిత్వం ఏమాత్రం కుదిపిందో చూసుకోవాలి. తన అభివ్యక్తి ఎందరి హృదయాల్ని కదిలించిందో తెలుసుకోవాలి. కవిత్వానికి ఒక ప్రయోజనం ఉంటుంది. అది పేరు కోసం చేసే కలాపం కాదు. శిల్పం, శైలి, రమ్యత, సొగసుదనం ఉంటాయి. ఇవ్వన్నీ కలిసి కవిత్వాన్ని ఉదాత్తం చేస్తాయి. అభివ్యక్తిని పదును దేలుస్తాయి. వస్తువు కూడా అంతే బలమైనదై చదవగానే విస్మయుల్ని చేసే విన్యాసమేదో కవిత్వంలో ప్రతిఫలించాలి. సాధారణంగా చూసే పదాల కలయిక కవిత్వంలో కొత్త భావాలతో ఆవిష్కృతం కావాలి. అలాంటి నవ్యత వున్న కవిత్వమే కాలంతోపాటు వెలుగుతుంది. ప్రతి తరాన్ని ఉద్దీప్తం చేస్తుంది. కనీసం తమ చుట్టూ ఉన్నవారిని తమ కవిత్వం కొంచెమైనా కదిలిస్తుందో లేదో ఇవాళ్టి కవులు చూసుకోవాలి. అప్పుడే కవిత్వానికీ, కవిత్వ పండగలకీ సార్థకత.

వెంటాడే వాక్యం

ఎవరైతే నేర్చుకోవడం మానేస్తారో వారు వృద్ధులు అయినట్లే. ఎవరైతే నిరంతర విజ్ఞానాభిలాషలో వారు సర్వదా యువకులుగానే ఉంటారు.

- హార్వే ఉల్‌మన్

ప్రజాశక్తి

సోపతి

డిసెంబర్ 14, 2014

లేఖలు	**4**
ఆ పాత మధురాలు రైతు జీవన ప్రతీక	**5**
కవర్‌స్టోరీ	
పుస్తకానికి మహర్దశ	**6**
కథ	
ప్రియమైన స్త్రీ	**10**
జోక్స్ కార్నర్	**12**
పదే పదే ఫోన్ చేస్తున్నారా	**13**
నెమలీక	**14**
సీరియల్ ప్రేమ - విప్లవం	**16**
నివాళి సంగీత కళానిధి	**18**
వికాసం నిన్ను నువ్వు దిద్దుకో...	**20**
వాయిదాల పద్ధతికి స్వస్తి చెబుతారా?	**21**
నవరాగం నిరతము చింతన మధురమే కాదా?	**22**
సోర్స్‌కోడ్ ఆండ్రాయిడ్ ఫోన్లకు వైరస్	**23**
సమీక్షలు	
బహుముఖ ప్రజ్ఞాశాలి	**24**
ఈ వారం కవిత్వం	
కాపాడుకోవాలి	**26**

పుస్తకాల పండగ మళ్ళీ వచ్చింది. ఈ నెల 17న హైదరాబాద్‌లో, జనవరి 1, 2015 నుంచి విజయవాడలో పుస్తకాల ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ నేపథ్యాన పుస్తకాల తీరుతెన్నులపై ముఖచిత్ర కథనమిది.

లేఖలు



ఎయిడ్స్‌ను తరిమేద్దాం

నవంబర్ 30 ప్రజాశక్తి సోపతి సంచికలో కవర్‌స్టోరీ 'చికిత్స లేదు, చైతన్యమే రక్ష' ద్వారా ప్రపంచం మొత్తాన్ని గడగడలాడించిన మహమ్మారి ఎయిడ్స్ వ్యాధి అని, మందులు లేని రోగం ఎయిడ్స్ మాత్రమేనని, ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయని అర్థమైంది. శరీరంలో రోగనిరోధకశక్తిని హరించడమే హెచ్.ఐ.వి చేసేపని, క్రమ శిక్షణ, దృఢ విశ్వాసంతో వుంటే బతికే కాలాన్ని పొడిగించుకోవడమే కాకుండా వైద్యుని సలహాలు తీసుకుంటూ ఉండాలి. హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉన్న వారిపట్ల దయ, కరుణ చూపి వారిని మనలాంటి మనుషులుగా గుర్తించుదాం. ఎయిడ్స్ వ్యాధితో లక్షా ముప్పై వేలమంది మరణించడం బాధాకరం. మన దేశం నుండి ఈ వ్యాధిని కూకటివేళ్లతో తరిమేద్దాం.

– కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్

కృషి చేద్దాం

తెలుగు మాట్లాడే ప్రతి వ్యక్తికీ గుర్తుండి పోయే మనీషి గురజాడ అప్పారావు. కల్పితమే అయినా ఆయన పుట్టించిన గిరీశం పాత్ర లాంటి వాళ్లు ఎప్పటికీ తారసపడుతూనే ఉంటారు. ఆయన కలం నుంచి వచ్చిన పుత్తడి బొమ్మలు నేటికీ దేశం నలుమూలలా కనిపిస్తున్నారు. వందేళ్లకు పూర్వమే ఈ సమస్యను చెప్పి, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ లాంటి వాళ్లు ఉండకూడదని గురజాడ చెప్పినా ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. మహిళల జీవితాల్లో, సమాజంలో మార్పు రావాలని కోరుకున్న గురజాడ కోరిక నేటికీ తీరలేదు. శత వర్ధంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకుంటూ గురజాడ కలలుగన్న సమాజం ఏర్పాటు కావడానికి కృషి చేద్దాం.

– విశ్వం, మెదక్

ఆసక్తిగా ఉంది

అహంకార ప్రదర్శనలో ఎన్ని రూపాలు ఉంటాయో తెలిపిన వ్యాసం ఆసక్తిగా చివరి వరకు చదివించింది. గుర్తింపు కోసం పడే తపన కూడా అందులో భాగమే అని చెప్పడం కొత్తగా అనిపించింది.

– జయ, హైదరాబాద్

అందం కోసం తపన

సౌందర్యం అనే భావన రోజు రోజుకీ అందరిలో పెరుగుతుందే కానీ తగ్గడం అనే మాట ఉండదు. అందంగా కనపడడం కోసం శరీరాన్ని హింసించుకోడానికి కూడా వెనుకాడని పరిస్థితులు నేడున్నాయి. శుభ్రత, సంతోషానికి మించిన అందం లేదని చెప్పడం బాగుంది.

– విశాలాక్షి, నిజామాబాద్

ఇంకా తెలుసుకోవాలనిపిస్తుంది

సావిత్రి వ్యాసం అలరించింది. ఆమె జీవితం అటు సినిమా నటులకే కాదు, సినిమా చూసే ప్రేక్షకులకు కూడా గొప్ప పాఠమే. ఆమెతో ముఖాముఖి పరిచయం లేకపోయినా సావిత్రి తెలుగు ప్రజలందరికీ ఇంట్లో మనిషై పోయింది. ఆమెతో పోల్చదగ్గ తార ఇప్పటి వరకు చిత్ర సీమలో రాలేదంటే అతిశయోక్తి కాదు. ఆమె సినిమాలు ఎన్ని చూసినా, ఆమె గురించి ఎంత చదివినా ఇంకా తెలుసుకోవాలనే అనిపిస్తుంది. టూత్‌పిక్స్, రెప్పపాటులో ఫొటోలు ఆకట్టుకున్నాయి.

– షరోన్, మహబూబ్‌నగర్

మన జాతీయాలు

తొండ బిర్రు

బిర్రు అనగా బిగువు. టెక్కు, టెంపరితనం. తొండ పురుగుల్ని ఈగల్ని ప్రాణంతోనే పట్టుకుంటుంది. చూడడానికి గంభీరంగా కనిపిస్తుంది. అదే దాని బిర్రు. ఆగినపుడు దండీలు తీసినట్లు, భరతనాట్యంలో తలముందుకూ వెనకకూ ఆడించే విన్యాసం చేస్తుంది. పిల్లలెవరైనా రాయి విసిరితే పారిపోతుంది. తొండబిర్రు ఏనుగుల దాకనే అన్న సామెత వుంది. ఇంటి ప్రహరీ గోడ మీద పరుగు తీస్తుంది. కాబట్టి అదే దానికి గుర్రం స్వారీ. కంపవరకే తొండ పరుగు తీస్తుంది. కాని కంపలో ఉరుకలేదు. తొండపొగరు దాని సీమ వరకే. కొందరు నూతిలో కప్పలాంటివారు. పల్లెల్లో నాదే సామ్రాజ్యమనుకున్నట్లుగా ప్రవర్తిస్తారు. అటువంటి వాళ్ళ గురించి "వీడి గొప్పతనం, ఆర్భాటం అంతా మన ముందరే. ఊరుదాటితే ఉత్తదే. అంతా తొండబిర్రు. పోలీసును చూస్తే భయపడతాడు" అంటారు. ఈవిధంగా ఈ జాతీయం వాడుకలోకి వచ్చింది. మేకపోతు గాంభీర్యం ఇలాంటిదే కాని తేడా వుంది. తొండ బిర్రు పరిమితమైంది. అంతట చెలాయించదు. కంప కనబడితే తగ్గిపోతుంది.

కళ్ళ మన్నకాడ బిచ్చగాళ్ళు

కళ్ళం అంటే ధాన్యం నూర్చే చోట. రైతు పంటకోసి విత్తనాలు మార్చటానికి కళ్ళంలో వేస్తాడు. పంటకోసిన కూలివాళ్ళు, ధాన్యం భిక్షగా అడిగేవారు కళ్ళం కాడికి చేరుతారు. పండిన పంటనంతా ఏ రైతైనా ఏకంగా ఇంటికి చేర్చలేడు. దయాభిక్షగా కొందరికి ఔదార్యంగా పంపిణీ చేస్తాడు. తెప్పలుగా చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు లాంటి సామ్యమే ఇది. సంపాదించిందంతా మనకే చెందదు. కొంత పన్నులకు, కొంత లంచాలకు, మామూళ్లకు పోతుంది కదా. ఇలాంటి చాల సందర్భాలలో ఈ జాతీయం ఉపయోగిస్తారు. 'పిలవని పేరంటంగా వీళ్లంత వచ్చారు. ఎక్కన్నుంచి పెట్టేది వీరికి' అని కొడుకు తండ్రితో సందేహం వెలిబుచ్చాడు. "కళ్ళమన్నకాడ బిచ్చగాళ్ళు, ఏదో మనం పండగ చేసుకున్నాం కదా అని దారి వెంట పోయేవారు వాసన పసిగట్టి వస్తారు. చీదరించుకుంటే ఎలా? కళిగిందానిలో వీలైనంతవరకు పెట్టాలి. ఎవరి కన్నెటువంటిదో" అనటంలో ఈ జాతీయం వాడకంలో వుంది.

చెమకాడ తీరు

చెమకాడ చూస్తూ చూస్తుండగానే ఏపుగా పెరుగుతుంది. అయితే బొంగుగా ఉంటుంది. అయినా నిమ్ముగా, ముద్దుగా ఉంటుంది. దాన్ని అనుసరించే "దాని కన్నేండ్లు. మొన్నటిదే అంతా పన్నెండేండ్లు లేవు చేమకాడ లాగా పెరిగింది" అనడంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

– వేముల పెరుమాళ్ళు

■ ఆ పాత మధురాలు

ఈ పాట "శ్రీరాములయ్య" చిత్రంలోనిది. నేటికీ మన రైతన్న దుస్థితికి అద్దం పట్టే గీతం ఇది.

"భూమికి పచ్చని .. భూమికి పచ్చని...
భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంట చేలు పెరగాలి ఓ అమ్మలాలో అమ్మలాల"

ఈ పాటను ఎన్నిసార్లు విన్నా మళ్లీ మళ్లీ వినాలని పిస్తుంది. ఈ పాటలో కవి పేర్కొన్న ప్రతీకలన్నీ ఎంతో స్వచ్ఛంగా వాస్తవ రైతాంగ జీవనచిత్రాన్ని ప్రతిబింబిస్తాయి. అదే సందర్భం లో మన గుండెను తడి చేసే భావుకత నిండుగా ఉన్న పాట ఇది.

భార్య పుస్తెలమ్మి అప్పు తీర్చాల్సిన దుస్థితిలో రైతు ఉన్నాడనీ, వల వల ఏడ్చుకుంటూ వేరే ప్రాంతాలకు కూలీలుగా వలసలు పోతున్న దైన్యాన్ని ప్రస్తావిస్తూ ఆ పరిస్థితికి పురుగుల మందే పెరుగన్నం ఆయెనా అంటూ రైతు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిని చెప్పిన తీరు గుండెల్ని పిండేస్తుంది.

రైతు జీవన ప్రతీక

అంతలోనే చెర వీడి భూతల్లి చెంతకి చేరితే, పంట చేతికొస్తే పండుగ చేద్దామంటూ రైతుకు గొప్ప ఆశను రేపడం కూడా బాగుంది.

కూలోళ్లంతా కలిసికట్టుగా పొలం పనులు చేసేందుకు వెళ్లడం ఓ జాతరతో పోల్చడం అద్భుతం. వాళ్ల పనిని వర్ణిస్తూ ఎత్తూ పల్లాలను చదును చేసే జాతర, చేలు దున్ని చాళ్లు తీసే బీదాబిక్కీ జాతర అంటూ పచ్చని పంట పెరగడానికి నేల అనువుగా చేయడం ప్రధానం. ఆ శ్రమైక జీవన దృశ్యాన్ని చూపిస్తుంది. ఎద్దుకొమ్ముల నడుమ ఎర్రని సూరీడు అన్న పోలిక అద్భుతం. ఎద్దులతో వ్యవసాయం చేస్తుంటే ఎదురుగా కనిపించే సూరీడు ఆ కొమ్ముల మధ్య కనిపించడం ప్రకృతి సౌందర్యం. కానీ ఆ కొమ్ములు భూస్వాములైతే గుండెల్లో దడ పుట్టించేలా, ఎర్రని సూరీడు గుడిసెలోళ్ల జాతర అనడం పేదవాళ్ల రగిలే గుండెకు ప్రతీకగా చెప్పడమే.

చెమట జల్లు చిలకరిస్తే నేల పులకరిస్తుందనడం చెమటోడ్చే శ్రమ జీవులకు ప్రతీకగా చెపితే, వానొస్తే భూతల్లి సీమంతం ఆడుతుందని చెప్పడం అద్భుతమైన వర్ణన. తంగేళ్ల గన్నేర్లు పసుపు కుంకమిస్తుందని చెప్పడం. ఆ సీమంతం చేసుకునే ఆమె ఇచ్చే పసుపు కుంకుమల్ని పచ్చని తంగేడుపూలు, ఎర్రని గన్నేరులతో పోల్చడం సహజంగా ఉంది. పశువుల మెడన చిరుగజ్జెలు ఘల్లున మ్రోగడం.. ఆ మోతల్లో పల్లె పరవశించెను అనడం.. పొలం దున్నేప్పుడు పశువులు మెడలో గజ్జలు మోగుతాయి. ఆ గజ్జల మోతలకు పల్లె పరవశిస్తుందంటే సంగీతానికి పారవశ్యంలో పల్లె ఉందనుకోవడం సాధారణం. పొలంపనులు సవ్యంగా జరిగితే, సిరిసంపదలతో ఆ పల్లె పరవశిస్తుందన్న అర్థం ఇందులో ఇమిడి ఉంది.

ఇంతవరకూ పాటంతా రైతును, పల్లె వాతావరణాన్ని మన ముందు ఆవిష్కరిస్తే, చివరి చరణం మాత్రం సీమ జీవన చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది.

ఎగువ పెన్నమ్మ ఎగిరెగిరి దునికినా, తుంగభద్రమ్మ పొంగి పరవళ్లు తొక్కినా, చిత్రంగా చిత్రావతి చిందులు ఆడితె నేల తల్లి నీళ్లాడి పసిడి పంటలిస్తుందనీ, అప్పుడు నా సీమ కన్నుల్లో వెలుగులు నిండుతాయని కవి చెప్పిన భాష్యం, భావం నదీజలాలు నిండుగా ఉండాలనే ఆ ప్రాంత రైతుల ఆశల్ని, ఆకాంక్షల్ని ప్రతిబింబించేవి.

ఈ పాటకు సాహిత్యం కలేకూరి ప్రసాద్ సమకూరిస్తే, సంగీతం వందే మాతరం శ్రీనివాస్ చేశారు. ఇద్దరూ పేదవాళ్ల గుండెచప్పుడు తెలిసినవారే. అంతేకాదు ఈ పాటకు జవసత్వాలు వచ్చాయంటే అది కెజె ఏసుదాసు గాత్రం తోడవడమే అంటే అతిశయోక్తి కాదేమో. ఈ సంగీత, సాహిత్య త్రయం మేలు కలయికతో మనందరి హృదయాల్ని ఈ పాట తడిమి, తడిపేసింది. అందుకే ఈ ముగ్గురికీ మన్నపూర్వక హృదయాంజలి ఘటించకుండా ఉండలేం.

పాట: పల్లవి: భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంట చేలు పెరగాలి ఓ అమ్మలాలో అమ్మలాల
ఆలి పుస్తెలమ్ముకుని అప్పు తీర్చుకుంటివో అమ్మలాల
వల వల వల ఏడ్చుకుంటూ వలసెల్లిపోతివో అమ్మలాల
పురుగుల మందే నీకు పెరుగన్నెం ఆయెనో అమ్మలాల
చెర వీడి భూతల్లి చెంతకి చేరిందిరో
పంట చేతికొస్తే పండుగ చేద్దామురో
భూమికి పచ్చని .. భూమికి పచ్చని...

భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంటచేలు పెరగాలి ఓఅమ్మలాలో అమ్మలాల
చరణం 1: జాతరమ్మ జాతరమ్మ కూలి జనం జాతరో అమ్మలాల
ఎత్తూ పల్లాలనే చదును చేసే జాతరో అమ్మలాల
చేలు దున్ని చాళ్లు తీసే బీద బిక్కి జాతరో అమ్మలాల
ఎద్దు కొమ్ముల నడుమల ఎర్ర పొద్దు పొడిచెరో
భూస్వామి గుండెల దడ గుడిసెలోళ్ల జాతర
భూమికి పచ్చని .. భూమికి పచ్చని...
భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంటచేలు పెరగాలి ఓఅమ్మలాలో అమ్మలాల
చరణం 2: చెమట జల్లు చిలకరిస్తే నేల పులకరించురో అమ్మలాల
వానొస్తే భూతల్లి సీమంతం ఆడురో అమ్మలాల
తంగేళ్ల గన్నేర్లు పసుపు కుంకమిచ్చురో అమ్మలాల
పశుల మెడన చిరుగజ్జెలు ఘల్లున మ్రోగేనో అమ్మలాల
గజ్జల మోతల్లో పల్లె పరవశించెను
భూమికి పచ్చని .. భూమికి పచ్చని...
భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంటచేలు పెరగాలి ఓఅమ్మలాలో అమ్మలాల
చరణం 3: ఎగువ పెన్నమ్మ తల్లి ఎగిరెగిరి దునికితే అమ్మలాల
తుంగభద్రమ్మ పొంగి పరవళ్ళు తొక్కితే అమ్మలాల
చిత్రంగ చిత్రావతి చిందులు ఆడితె అమ్మలాల
నేల తల్లి నీళ్లాడి పసిడి పంటలిచ్చురో
నా సీమ కన్నుల్లో వెలుగులు నిండేనురో
భూమికి పచ్చని .. భూమికి పచ్చని...
భూమికి పచ్చని రంగేసినట్టు అమ్మలాల
పంటచేలు పెరగాలి ఓఅమ్మలాలో అమ్మలాల

- శాంతిశ్రీ, 9866371283

పుస్తకానికి మహర్దశ

- ఎస్.కె సలీమ,
9490099083

రాత్రి పదిగంటల సమయం... డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చొని కిండెల్‌లో హరిప్రియ, టాబ్లెట్‌లో ప్రణయ్ ఈబుక్స్ చదువుతున్న దృశ్యం... ఆ సన్నివేశం అప్పుడే ఇంటికి చేరిన కిరణ్‌ని ముగ్ధుణ్ణి చేసింది. బుడ్డిదీపం వెలుగులో శరత్ 'శ్రీకాంత్'ని, గోర్కీ 'అమ్మ'నీ, ప్రేమ్‌చంద్ 'రంగభూమి'ని చదువుకున్న రోజులు గుర్తుకొచ్చాయతనికి. ఒక తరం నుంచి మరో తరం పుస్తకాల్ని చదువుకునే పరంపరకు అదొక సంకేతం. ఆ ఇంట్లో అయిదేళ్ళుగా టీవీ మూలన పడింది. ఇంజనీరింగ్ చదువుతున్న పిల్లలు కాస్త సమయం చిక్కితే పుస్తకాలు చదువుతారు. వరల్డ్ సినిమాలు చూస్తారు. ఆ సినిమాలకు ఆధారమైన నవలల కోసం నెట్‌లో బ్రౌజ్ చేస్తారు. చదివే సంస్కృతికి టెక్నాలజీ తోడ్పడిందే గానీ చదువును హరించలేదు. పుస్తకాన్ని మింగేయలేదు. టెక్నాలజీ పరిణామాలకు పుస్తకం తోడ్పడింది. అదే టెక్నాలజీ పుస్తకాలు చదివే అలవాట్లను విస్తృతం చేస్తోంది. తెలుగునాట నగరాల్లో, పట్టణాల్లోనూ చదివే అలవాట్ల ధోరణి మునుపటి కన్నా పెరిగింది. ఈతరం పాఠకులు కాలక్షేపం కోసం చదవరు. తమ మేధకీ, హృదయానికీ ఉపకరించే పుస్తకాలు చదువుతున్నారు. ఈ క్రమాన ఇరవై ఏళ్ళ కిందటితో పోలిస్తే ఆంగ్ల పుస్తకాల అమ్మకాలు హైదరాబాద్, విజయవాడ, విశాఖ వంటి నగరాల్లో పెరిగాయి. తెలుగు పుస్తకాల్లోనూ అవసరమైన పుస్తకాల్ని వెదికి వెదికి చదువుతున్నారు. పాఠకులకు అవసరమైన, పాఠకుల్ని చైతన్యపరిచే పుస్తకాల్ని ప్రచురణకర్తలు వెలువరిస్తున్నారు. ఈ క్రమంలో అనేక క్లాసిక్స్ వెలుగు చూస్తున్నాయి. ఫలితంగా చదువరుల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఇవాళ పుస్తకానికి మహర్దశ లభించిందన్న మాట నిజం. దీనికి తెలంగాణ ప్రభుత్వం కూడా చేయూత నిచ్చి పుస్తకాలు కొంటే మన గ్రంథాలయాలు కొత్త పుస్తకాలతో, కొత్త పాఠకులతో కళకళలాడుతాయి. పిల్లలతో రెస్టారెంట్లకు, బట్టల షాపులకు, థియేటర్లకు వెళ్ళే తల్లిదండ్రులు ఏడాదికోసారి జరిగే పుస్తకాల ప్రదర్శనలకు పిల్లల్ని తీసుకెళ్ళాలి. వేలాది పుస్తకాలు కొలువు తీరిన సుందర దృశ్యాల్ని వారికి పరిచయం చేయాలి. ఎందుకంటే పుస్తకాలు ప్రపంచం కిటికీలు. ఆ కిటికీల్లోంచి లోకాన్ని, చరిత్రనీ, విజ్ఞానాన్ని అవలోకించడం సాధ్యం. ఇందుకోసమే ఈ నెల 17 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో, జనవరి 1 నుంచి 11, 2015 వరకు విజయవాడలో జరిగే పుస్తకాల ప్రదర్శనలు పాఠకులకు అపురూపమైన పండగలు. ఈ పండగల సందర్భంగా పుస్తకాల తీరుతెన్నులకు సంబంధించిన కథనం ఇక్కడ చదవండి.

పుస్తకం ఒక నేస్తం. మనిషికి అమూల్యమైన సంపద పుస్తక అధ్యయనం. అది డబ్బుతో వెలకట్టలేనిది. కాలం ఎంతగా మారి ఇంటర్నెట్ యుగం వచ్చి ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా మారినా పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదు. పుస్తకం దైనందిన అవసరం. మానసిక వికాసానికి ఉపకరణం. ప్రపంచ నలుమూలల్లో ఏంజరిగినా క్షణాల్లో తెలిపే అధునాతన టెక్నాలజీ కళ్ళ ముందున్నా పుస్తకం అవసరం మగీలే వుంది. కనుకనే పుస్తకం స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. అదే వాస్తవం కూడా. అందుకే నేటికీ బుక్‌ఫెయిర్‌లు, ఎగ్జిబిషన్‌లు ఎక్కడ జరుగుతున్నా పాఠకుల నుండి మంచి స్పందన వస్తుంది. వేల కొద్ది పుస్తకాలు అమ్ముడుపోతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న మొట్టమొదటి బుక్ ఫెయిర్ ఇది. ఈ నెల 17 నుండి ఎన్.టి.ఆర్ స్టేడియంలో ప్రారంభం కానున్నది. అధ్యయన అవసరం పెరిగిన ఈ నేపథ్యంలో ఈ బుక్‌ఫెయిర్ విశిష్ట స్థానాన్ని సంతరించుకుందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ కార్యదర్శి కె.చంద్రమోహన్ అంటున్నారు. బుక్ ఫెయిర్ అంటే కేవలం పది రోజుల పండుగ మాదిరిగా కాకుండా ప్రతిరోజూ పుస్తకాలు ప్రజలకు అందుబాటులో వుండేవిధంగా భవిష్యత్తులో ప్రణాళిక రూపొందించుకోబోతున్నామని సొసైటీ అధ్యక్షులు గౌరీశంకర్ అంటున్నారు.

పుస్తక అధ్యయనానికి ఆదరణ

టీ.వీ, ఇంటర్నెట్ వచ్చిన తర్వాత పుస్తకాలు చదవడం తగ్గిపోయిందని కొంత మంది అపోహపడుతున్నారు. యువత ఇంటర్నెట్‌కు అలవాటు పడినా తిరిగి నలభై సంవత్సరాలు దాటిన తర్వాత మళ్ళీ పుస్తకాన్ని చదవటానికే ఇష్టపడుతున్నారు. పుస్తకాలకు ఎంతటి ప్రాధాన్యత పెరిగిందో

రచయితలకు ప్రత్యేక రాయితీలు

హైదరాబాద్‌లో జరగబోవు బుక్‌ఫెయిర్‌కు ప్రజల మనిషి, తెలంగాణ తొలి రచయిత 'వట్టికోట ఆళ్వారు స్వామి ప్రాంగణంగా' నామకరణం చేశాం. ఇందులో ప్రముఖ పుస్తక రచయితలు, అధ్యయనం పట్ల అభిరుచి కలిగిన ప్రముఖుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నాం. అలాగే తెలంగాణ వాగ్గేయకారులు, కళాకారులు సుద్దాల అశోక్‌తేజ, గోరటి వెంకన్న, జయరాజ్, రసమయి వంటి వాళ్ళతో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కవి సమ్మేళనం ఉంటుంది. అన్ని పత్రికల సంపాదకులతో సదస్సు జరగబోతుంది. వీటికి ఆంధ్రరాష్ట్ర కవులను కూడా ఆహ్వానిస్తున్నాం. ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతం వివిధ భాషా, సంస్కృతుల నిలయం. తెలుగు, తమిళం, మళయాళం, గుజరాతీ సంస్కృతులు హైదరాబాద్‌లో ఎక్కువ. కాబట్టి ఈ భాషలకు సంబంధించిన పుస్తకాలను బుక్‌ఫెయిర్‌లో ప్రాధాన్యం ఇస్తున్నాం. గతంలో ఒకసారి ఖమ్మంలో బుక్‌ఫెయిర్ జరిగింది. మంచి స్పందన కూడా వచ్చింది. కాబట్టి భవిష్యత్తులో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలలో కూడా పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాం. అలాగే ప్రస్తుతం ఈ బుక్‌ఫెయిర్‌లో పుస్తకాలు ప్రదర్శించుకునే వారికి, సందర్శించే వారికి కొన్ని ప్రత్యేక రాయితీలు కూడా అందిస్తున్నారు.

– కె. చంద్రమోహన్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి

చెప్పాలంటే ఒకటే ఉదాహరణ. తెలుగు సాహిత్యాన్ని అత్యధికంగా ప్రచురించే ప్రజాశక్తి, విశాలాంధ్రలతో పాటు వ్యక్తిగతంగా రచయితలు ముద్రించుకునే పుస్తకాలు తెలుగు నాట రోజూ విడుదలవుతున్నాయి. తెలుగు పుస్తకం ప్రచురితం కాని రోజు లేదు. ఏటా వందలాది పుస్తకాలు అచ్చవుతున్నాయి. యువత పుస్తకాల్ని చదువుతోంది. తమకు నచ్చిన పుస్తకం పి.డి.ఎఫ్(ఇ- బుక్) కాపీల్ని మొబైల్‌లోకి డౌన్ లోడ్ చేసుకొని చదువుతున్నారు.

ఆన్‌లైన్ వచ్చినా పుస్తక స్థానాన్ని భర్తీ చేయలేదు

మన దేశంలో ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్ లైన్ కూడా సమాంతరంగా వుంటుంది. దేశంలో అక్షరాస్యత 73 శాతం మాత్రమే. ఆన్‌లైన్ పుస్తకాలు, ఇంటర్‌నెట్ చూసేవారు అనేకం వున్నారు. ఐనప్పటికీ ఈ –బుక్స్‌కు చాలా పరిమితులు వున్నాయి. ఇంటర్‌నెట్ అందరికీ అందుబాటులో లేదు. పుస్తకం అనేది జీవిత కాల నేస్తం. పుస్తకంచేత్తో పట్టుకొని చదవడంలోని ఆనందం అలవి కానిది. అంటే ఆన్‌లైన్, ఇంటర్‌నెట్ ఎంత అభివృద్ధి చెందినా పుస్తకం యొక్క ప్రాధాన్యం తగ్గలేదు. ఇ బుక్స్ కన్నా అచ్చుపుస్తకానికే ఆదరణ అధికం.

ప్రస్తుతం అమ్ముడవుతున్న పుస్తకాలు

టెక్నాలజీ ఎంత పెరిగినా నేటికీ పుస్తక అమ్మకాలు ఎంత మాత్రం తగ్గలేదు. ప్రజల దగ్గరకు తీసుకెళ్ళగలిగితే ప్రతి పుస్తకానికి ఆదరణ వుంది. దానికి ప్రస్తుతం జరుగుతున్న పుస్తక ప్రదర్శనలే నిదర్శనం. నేడు ప్రజాశక్తి, విశాలాంధ్ర మొబైల్ (వాహనాల) పుస్తకాలకు విపరీతమైన ఆదరణ వుంది. అయితే ఆయా సమాజాల్లో వున్న ప్రభావిత భావజాలం ప్రజల్లో వుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా సోషలిజానికి ప్రాధాన్యం వున్నప్పుడు సోవియట్ భూమి పుస్తకాలు అమ్ముడుపోయాయి. ప్రస్తుతం కెరీర్ ప్రాధాన్యం పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసం, ఆంగ్లభాష, ఆరోగ్యం, యోగా, వంటలు తదితర పుస్తకాలు ఎక్కువ విక్రయాలు అవుతున్నాయి.

ప్రభుత్వ సంస్థలు పుస్తకాల కొనుగోలు పెరగాలి

ప్రభుత్వ సంస్థలు పుస్తకాలు ప్రస్తుతం పబ్లిషర్ వద్ద అసలు కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం పబ్లిషర్స్ వద్ద పుస్తకాలు కొనుగోలు చేస్తే వారికి, రచయితలకు ప్రోత్సాహకంగా వుంటుంది. తమిళనాడులో ఏ కవి, రచయిత రాసిన పుస్తకమైనా 500 కాపీలు ప్రభుత్వం కచ్చితంగా కొని తీరుతుంది. ఇది చాలా మంచి విషయం. మన రాష్ట్రంలో కూడా అటువంటి పరిస్థితి రావాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా పుస్తకాలు కొనాలని రచయితలు, ప్రచురణ కర్తలు కోరుతున్నారు.

తెలంగాణలో రచయితలకు, పబ్లిషర్స్‌కు ఆదరణ

తెలంగాణలో తెలుగు అంటే తెలంగాణ మాండలిక భాషా పుస్తకాలు విస్తృతంగా రావాలి. మన భాష జీవ భాష, స్వచ్ఛమైంది. ఆ పదజాలంతో కథలు, కవిత్వాలు, నవలలు రావాలి. రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా

అధ్యయనంపై అవగాహన

ఇంటర్‌నెట్, యూట్యూబ్ వాడకం పెరిగిన తరువాత పుస్తక అధ్యయనం కాస్త తగ్గిందనే చెప్పుకోవాలి. నేటి యువత దొంగతనాలు, దోపిడి, అమ్మాయిలపై దాడులకు తెగబడటానికి కారణం పుస్తక అధ్యయనం తగ్గడం కారణమని చెప్పవచ్చు. ముప్పై సంవత్సరాల క్రితం పుస్తకానికి ఎంతో ప్రాధాన్యత వుండేది. అందుకే ఇటువంటి పరిస్థితుల్లో యువతలో మానసిక వికాసం పెంచడానికి వుపయోగపడే అభ్యుదయ సాహిత్యాన్ని విస్తృతంగా తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. ఇప్పుడు బుక్‌ఫెయిర్‌లో పది స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. 2,800 టైటిల్స్‌కు సంబంధించిన పుస్తకాలను పాఠకులకు అందించబోతున్నాం. వీటిలో ముఖ్యంగా అభ్యుదయసాహిత్యం, పిల్లలకు సంబంధించినవి వుంటాయి. ఇటువంటి బుక్‌ఫెయిర్‌లు పెద్దఎత్తున జరిగే విధంగా ప్రభుత్వం సహకరించాలి.

– మనోహర్, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్

అభ్యుదయ సాహిత్యానికి నెలవు ప్రజాశక్తి

తెలంగాణ రాష్ట్రంలో అభ్యుదయ సాహిత్యానికి అధిక ప్రాధాన్యం వుంది. ఎంతో మంది అభ్యుదయ రచయితలు తెలంగాణలో వున్నారు. అందుకే ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు ఎంతో ప్రాముఖ్యత వుంది. వామపక్ష అభిమానులు, రచయితలు సుమారు 50 మంది రచించిన పుస్తకాలతో ప్రజాశక్తి పుస్తకాలు ఈ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. మొత్తం ఏడు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. వెయ్యి రకాల పుస్తకాలు ఈ స్టాల్స్‌లో లభ్యమవుతాయి. ముఖ్యంగా చిన్న పిల్లల పుస్తకాలు, మహిళా సాహిత్యం, సామాజిక సాహిత్యం అందుబాటులో వుంటుంది. అంబేద్కర్ రచనలు, అంబేద్కర్, భగత్‌సింగ్, చేగువేరా ఇంకా అనేక మంది ప్రముఖుల జీవిత చరిత్రలు, కొత్తగా ప్రచురించబడ్డ 'నేను మలాల' పుస్తకం ప్రజాశక్తి బుక్‌స్టాల్‌లో సందర్శకులకు అందుబాటులో వుంచబోతున్నాం. ప్రజాశక్తికి అనుబంధంగా ఈ బుక్‌ఫెయిర్‌లో రీజనల్ భాషలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. చింతా మళయాళ పబ్లిషర్ పుస్తకాలు, భారతీ తమిళ పుస్తకాలు మొట్టమొదటి సారి ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఇ– పుస్తకాలు కూడా మన తెలుగులో దొరుకుతున్నాయి. అమెరికా లాంటి చోట కూడా 80 శాతం హార్డ్ కాపీలే అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం మన దేశంలోకాని, రాష్ట్రంలో కాని ఇంటర్నెట్ వాడే వారి సంఖ్య తక్కువ. కాబట్టి జనం పుస్తకాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఇటువంటి బుక్‌ఫెయిర్‌లు ఏర్పాటు చేస్తే సందర్శకులకు ఉచిత ప్రవేశం, రచయితలకు, పబ్లిషర్స్‌కు ఉచిత స్టాల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం వుంటుంది. అప్పుడు పుస్తకాలు ఎక్కువగా జనంలోకి వెళతాయి.

– విజయారావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్

పుస్తకం ద్వారానే జనంలో చైతన్యం

ఇప్పుడు నిర్వహిస్తున్నది 28వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్. ప్రస్తుతం ఈ బుక్‌ఫెయిర్ ఈ స్థాయికి చేరటానికి గతంలో చాలా మంది కృషి ఇందులో వుంది. 1985లో హైదరాబాద్‌లో బుక్‌ఫెయిర్ ప్రారంభించాలని నలుగురం కమిటీగా ఏర్పడ్డాం. అప్పట్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలంటే పెద్దగా అనుభవం లేదు దాంతో భయపడ్డాం. మాకు వామపక్షాలతో వున్న అనుబంధం, ప్రజాశక్తి, విశాలాంధ్రతో వున్న పరిచయం, గతంలో సాహిత్య వారోత్సవాలు జరిపిన అనుభవం దీనికి వుపయోగపడింది. మొత్తానికి పుస్తకం ద్వారా జనంలో చైతన్యాన్ని తీసుకురావాలనే అవగాహనతో వున్నవాళ్ళం కావడంతో ఎలాగైనా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ముందుకు వచ్చాం. ఇలా అనేక అటు పోట్లు ఎదుర్కొన్నాం. అప్పట్లో గ్రౌండ్ సమస్య ఎక్కువగా వుండేది. మొదట అశోక్ నగర్‌లోని లైబ్రరీలో 40, 50 స్టాల్స్ ఏర్పాటు చేశాం. నేషనల్ బుక్ ట్రస్టు(ఎన్‌బిటి) వారికి ప్రభుత్వమే పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయమని అవకాశం ఇచ్చింది. పుస్తకాలను ప్రచారం చేయడం, రచయితలను ప్రోత్సాహించడం జాతీయ స్థాయిలో నేషనల్‌బుక్‌ట్రస్టు బాధ్యత. ఎన్‌బిటి వారు పుస్తక ప్రదర్శనలు మిగతా రాష్ట్రాలలో కూడా ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఇంటర్నెట్ ఎంతగా పెరిగినా పుస్తకం ప్రాధాన్యత తగ్గే అవకాశమే లేదు. తల్లిదండ్రులు పిల్లలకు పుస్తకాలు చదవడం అలవాటు చేయాలి. మంచి మంచి పుస్తకాలు పిల్లలకు పరిచయం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులది. అలా చేస్తే భాష పట్ల పిల్లల్లో అవగాహన పెరుగుతుంది. స్నేహితులతో కలిసి మెలిసి మంచి జీవితం గడపడానికి అవకాశం వుంటుంది. నిరంతరం పుస్తకాలు చదివే వారికి సమాజం పట్ల మంచి అవగాహన వస్తుంది. అలాగే విజయవాడలో జరిగే బుక్‌ఫెయిర్ ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి 15 వరకు కొనసాగుతుంది. దాని నిర్వహణ కొరకు గ్రౌండ్‌ను రోజుకు పదివేల అద్దెతో ఇస్తున్నారు. గతంలో విజయవాడలో మొట్టమొదటి కమ్యూనిస్టు మేయర్‌గా పనిచేసిన టి.వెంకటేశ్వరరావుగారు విజయవాడ బుక్‌ఫెయిర్ కోసం కేవలం రెండు వేలకే పిడబ్ల్యుడి గ్రౌండ్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. తెలంగాణలో కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. కాని అది చాలదు. ప్రభుత్వ సహకారం ఇంకా పెరగాలి.

– పి. రాజేశ్వరరావు, బుక్‌ఫెయిర్ కమిటీ ట్రెజరర్

తెలుగు సాహిత్యానికి హిందీలో మంచి ఆదరణ

ఇప్పటి వరకూ నేను అనువాదం చేసిన 67 పుస్తకాలు, హిందీ, తెలుగు, భాషల్లో వెలువడ్డాయి. హిందీ, తెలుగు భాషల్లో పరస్పరం అనువాదాలు చెయ్యడమే కాకుండా ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదం చేస్తూ వుంటాను. పాఠకులు కాశ్మీరు నుంచి కేరళ దాకా నా హిందీ అనువాదాలు చదివి ఉత్తరాలు రాసేవారు, ఫోన్లు చేసేవారు ఒకరిద్దరు హిందీ పత్రికా సంపాదకులైతే సంపాదకీయాల్లో తెలుగు రచనల గొప్పతనాన్ని హిందీ రచనలతో పోలుస్తూ, వస్తువు, కథ చెప్పే విధానం మన కథల్లో ఎంత విశిష్టంగా ఉందనే విషయాన్ని హిందీ పాఠకుల దృష్టికి తెస్తూ కొన్ని వాక్యాలు రాసిన సందర్భాలు ఉన్నాయి. హిందీ పాఠకుల ఉత్తరాల్లో కొందరు, 'మనవాళ్ళు ఇలా ఎందుకు రాయలేక పోతున్నారు?' అని రాసిన సందర్భాలు ఉన్నాయి. అనువాదకులకి వున్న ఒకే ఒక సులువు ఎంపిక. మూల రచయితలకి లేని వెసులుబాటు ఇది. ఒక భాషలోని మంచి రచనలని మాత్రమే ఎంపిక చేసి అనువదించి పత్రికలకి పంపినట్లయితే ఆ భాషేతరులకి మన భాషలో ఉన్న మంచి రచనలే చేరుతాయి. హనీఫ్ రాసిన సింగరేణి కథల్లోని వ్యథలూ, మల్లిపురం జగదీశ్ రాసిన 'టిహిలికి పెళ్లి' వంటి గిరిజన సంస్కృతికి సంబంధించిన కథల అనువాదాలని హిందీ సంపాదకులు అడిగి మరీ వేసుకున్నారు. ఈ కథల్లోని ఇతివృత్తాలని తెలుగు రచయితలు మాత్రమే రాయగలరు. అందుకే అవి హిందీ వారికి ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి. ఈ మధ్య నేను ఆంగ్లం నుంచి తెలుగులోనికి అనువదించిన రెండు పుస్తకాలకి మంచి స్పందన వచ్చింది. కానీ 'అసురుడు' నవలకి వచ్చిన స్పందన అనూహ్యమైనది.నాకు ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కూడా కలిగించింది.

– ఆర్. శాంతసుందరి, అనువాదకులు

ప్రభుత్వం సహకారం కోరుతున్నాం

ఇటువంటి బుక్‌ఫెయిర్‌లు అన్ని జిల్లాల్లోను, ప్రధానమైన అన్ని పట్టణాల్లోనూ ఏర్పాటు చేయటానికి ప్రయత్నిస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారుల సహకారం కోరుతున్నాం. తెలంగాణ రాష్ట్రంలో పుస్తకాలకు, రచయితలకు ప్రాధాన్యం దొరుకుతుందని బలంగా నమ్ముతున్నాం. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకుంటాం. ఢిల్లీ, కోల్‌కటా తర్వాత అత్యంత ప్రాధాన్యం కలిగిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఒక మంచి వాతావరణంలో జరిగేలా కృషి చేస్తున్నాం. రకరకాల పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నా. బుక్‌ఫెయిర్ అంటే కేవలం పది రోజుల పండగగా కాకుండా ప్రతిరోజూ పాఠకుడికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో వుండేలా ప్లాన్ చేస్తున్నాం.

– జూలూరు గౌరీ శంకర్,
అధ్యక్షులు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ

సరైన పుస్తకం సరైన వారి దగ్గరకు చేరాలి

90 వ దశకం తర్వాత కొత్త కొత్త సెక్షన్ల నుండి ముఖ్యంగా దళితుల్లో చదువుకునే వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో వికసించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో బయట ప్రపంచంలో ఏం జరుగుతుంది, ప్రభుత్వ ఏం చేస్తుంది అనే విషయాలు జనానికి తెలియాలి. కాబట్టి నేడు పుస్తకాల అవసరం చాలా పెరిగిపోయింది. మేము ముద్రించిన పుస్తకాలు చాలా తక్కువనే చెప్పవచ్చు. మా ముద్రణలో వచ్చిన 'ఒక దళారీ పశ్చాత్తాపం' పుస్తకం అమెరికా విధానాలు ఎండగట్టింది. ఆ పుస్తకం ఎనిమిది సంవత్సరాలలో ఎనిమిది సార్లు ముద్రించవలసి వచ్చింది. మొత్తం డెబ్బై వేల కాపీలు అమ్ముడయ్యాయి.

– ఎన్.వేణుగోపాల్, వీక్షణం సంపాదకులు

కవులు వున్నారు. ప్రస్తుతం రచయితలకు మంచి ఆదరణ వుంది. కాని కవిత్వానికి స్పందన తక్కువ వుంది. కవిత్వం రాసే కవులు, పుస్తకాలు విక్రయించడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కథలకు మాత్రం ఆదరణ వుంది. జీవిత చరిత్రల్ని చదవడానికి పాఠకులు ఇష్టపడుతున్నారు.

పుస్తకాలు ప్రజలకు అందుబాటులోకి రావాలి

పుస్తకాలు ముద్రింపబడుతున్నప్పటికీ వాటిని చదివే సరైన వ్యక్తుల వద్దకు ఆ పుస్తకాలు చేరటానికి మన దగ్గర ఎన్నో సమస్యలు వున్నాయి. ప్రస్తుతం విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తక దుకాణాలు మాత్రమే ఎక్కువ. ఇవి కూడా ఇంకా పెరగాల్సిన అవసరం వుంది. పాఠకుడి దగ్గరకు పుస్తకం చేరాలంటే పుస్తక దుకాణాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలి. దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి. పుస్తక దుకాణాలు అందుబాటులో లేకపోవడం వల్ల మారుమూల ప్రాంతాల్లో వుండే పాఠకులకు పుస్తకాలు అందుబాటులో వుండడం లేదు.

లైబ్రరీ వ్యస్థను పటిష్టపరచాలి

1970 తర్వాత మన దగ్గర లైబ్రరీ వ్యవస్థ ధ్వంసం అయింది. గతంలో లైబ్రరీలు పాఠకులకు బాగా వుపయోగపడేవి. చదువుకోవడానికి అనేక పుస్తకాలు అందుబాటులో వుండేవి. దాంతో ఎక్కువగా పుస్తకాల పట్ల ఆసక్తి వున్నవారు లైబ్రరీలను సందర్శించే వారు, చదువుకునే వారు. కాని నేడు లైబ్రరీల్లో కొత్త కొత్త పుస్తకాలు అందుబాటులో వుండడం లేదు. 80 దశకంలో జిల్లా గ్రంథాలయ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పబ్లిషర్స్ దగ్గర నుండి కమీషన్ తీసుకోవడం, అవినీతి పెరిగిపోయింది. పుస్తకాల రేట్లు విపరీతంగా పెంచేశారు. లైబ్రరీలు, పుస్తక దుకాణాలు పాఠకులకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థను పటిష్ట పరచాలి. గ్రంథాలయాలకు పుస్తకాలను కొనటం అనేది నిరంతరం జరగాలి. ప్రతి పాఠశాలలో పిల్లల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే నిబంధన వుండాలి. పుస్తకాలతోనే పిల్లలు వికాసం చెందుతారు. *

28వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఏర్పాట్లు

★ ముఖ్యంగా భారతీయ భాషా రయితల పుస్తకాల కోసం ఒక కామన్‌హాల్ ఏర్పాటు చేస్తున్నారు. వారు ఈ ఎగ్జిబిషన్‌లో పుస్తకాలు ప్రదర్శించుకోవటానికి ఒక్కో రచయితకు కేవలం పదిహేను వందల రూపాయలకే ఒక ర్యాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

★ భారతీయ భాషా పబ్లిషర్స్‌కు గతంలో స్టాల్స్ ఏర్పాటు

చేసుకోవడానికి కేవలం 20శాతం మాత్రమే రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు 50శాతం తగ్గించి వారికి తొమ్మిది వేలకే స్టాల్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

★ సందర్శకులకు అన్ని రకాల పుస్తకాలపై 10 శాతం తగ్గింపు ఉంటుంది.

★ విద్యార్థులు, ఉపాధ్యాయులలు గుర్తింపు కార్డులు చూపితే ఉచిత ప్రవేశ సౌకర్యం కల్పిస్తున్నారు.

★ అన్ని పత్రికల వారికి వారి పత్రికలు ప్రచారం చేసుకునే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఈ బుక్‌ఫెయర్‌ను రోజుకు యాభై వేల చొప్పున మొత్తం పది లక్షల మంది వరకు సందర్శించే అవకాశం వుంది. ఇక్కడ ఏర్పాటు చేసే పుస్తకాలలో దాదాపు రెండు వందల నుండి మూడు వందల మంది అభ్యుదయ రచయితల ప్రచురణలు, పుస్తకాలు సందర్శకులకు అందుబాటులో వుంటాయి. దాదాపు 300 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పదివేల రకాల పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయి.

■ కథ

"నమస్తే! డాక్టర్ గారు" అంటూ గుమ్మం దగ్గర నిలబడి, వాకిట్లో కూర్చొని మెడికల్ డిక్షనరీ చదువుతున్న ప్రముఖ సైకాలజిస్ట్ డా॥ జగదీష్‌ను పలకరించాడు ప్రకాష్. అది గమనించిన జగదీష్ 'అరే ప్రకాష్ నువ్వా, రారా' అంటూ ఆనందంగా పలకరించి కూర్చో బెట్టి 'ఏంట్రా గారు గీరు అంటున్నావ్ నేను డాక్టర్ అయినంత మాత్రాన మన స్నేహం మరచిపోతాననుకున్నావా?' అన్నాడు.

'అది కాదు జగదీష్, అప్పుడు వేరు ఇప్పుడు వేరు కదా, నలుమూలలా పేరు గాంచిన డాక్టర్‌వి నువ్వు' అంటూ ఇంకేదో చెప్తూండగానే మధ్యలో ఆపేసి 'సరే గాని ఇంకేట్రా సంగతులు, చెప్పా పెట్టకుండానే వచ్చావు, ఎక్కడుంటున్నావ్, ఏం చేస్తున్నావ్, భార్యా పిల్లలెలా ఉన్నారు?'... అంటూ గడగడా కుశల ప్రశ్నలు దొర్లించ సాగాడు.

కాని చిన్న నాటి స్నేహితున్ని చూసి జగదీష్ ఎంత ఆనందం, సంతోషం వెళ్ళబుచ్చుతున్నాడో ఆ ఆనందం ప్రకాష్ లో కనిపించడం లేదని గమనించి, 'ప్రకాష్! ఏంటదోలా వున్నావు ఏమైనా సమస్యా?' అన్నాడు.

"ఏమో జగదీష్! ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు"

"నాతో చెప్పడానికేంట్రా, చెప్పేది కాదా?"

'జగదీష్! మనం కలవక ఎంతో కాలమైనా నీ అడ్రస్ వెతుక్కునే సమస్య లేకుండానే నీ దగ్గరకు రాగలిగాను. ఎందుకంటే నీ అడ్రస్ లేని ఊరుండదుగదా? ఎక్కడ అడిగినా, ఎవ్వరినడిగినా టక్కుమని చెప్తారు' అన్నాడు తన మనసులో ఉన్న బాధను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో ప్రకాష్.

'సరేరా! మంచి పని చేశావ్ కాని ముందు నీ ప్రాబ్లమ్ ఏంటో చెప్పు' అంటూ కాస్తంత సీరియస్‌గా అడిగాడు స్నేహితుడనే బంధంపై ఉన్న అధికారంతో ప్రకాష్.

'ఏం చెప్పమంటావ్‌రా?! అమ్మా నాన్నల నుంచి వేరవుదామని నా భార్య గొడవ చేస్తుంది. సాలరీ రాగానే తీసుకుని తన దగ్గర పెట్టుకుంటుంది. ఎప్పుడూ అమ్మతో గొడవ పడుతూంది. అమ్మ కూడా నేనే తనను నా మాటలో ఉంచుకోలేక పోతున్నానని నామీదే గుర్రుగా ఉంటుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు' అన్నాడు.

'ఓహో! నీసమస్య అర్థమైంది. అంటే కౌన్సెలింగ్ ఇవ్వాలంటావ్, అవునా అంతేనా? ఎవరికివ్వాలి? వారిరువురికా, భార్యకా, అమ్మకా?' అంటూ ఒకింత వ్యంగ్యంగా అన్నాడు డాక్టర్ జగదీష్. ఆ భావం అర్థం కాలేదో అర్థం అయినా పట్టించుకోలేదో కానీ, 'అవును జగదీష్! సరిగ్గా నా మనసులో మాట చెప్పావ్' అన్నాడు.

'అందుకేరా నన్ను మానసిక వైద్యుడంటారు' అని నవ్వాడు జగదీష్ మనసులో ఉన్న బాధను మరిపించి కాస్తంత నవ్వించాలని.

దీంతో ప్రకాష్ జగదీష్ వైపు చూస్తూ 'ఊ' అంటూ బాధలో నైనా సంతోషాన్ని వెళ్లబుచ్చుతూ ఓ చిరునవ్వు వొదిలాడు అతి కష్టంగా.

'ఒరేయ్! కౌన్సిలింగ్ ఇవ్వాల్సింది వాళ్ళకే కాదురా, నీక్కూడా కావాలి' అంటూ భుజంపై చెయ్యేశాడు.ఆ మాటల్లో ఉన్న పరమార్థం ప్రకాష్‌కి అర్థం కాలేదు.

అంతలో జగదీష్ భార్య ఇద్దరికీ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

కాఫీ తీసుకుంటూ 'ప్రియా! వీడు ప్రకాష్, నా చిన్ననాటి స్నేహితుడు. నేను సిటీకొచ్చిన తర్వాత ఇన్నేళ్ళకు నేను గుర్తుకొచ్చానట' అంటూ నవ్వాడు.

ప్రియ నమస్కారం చేసింది, ప్రకాష్ కూడా ప్రతి నమస్కారం చేసి కాఫీ తాగి కప్పు టేబుల్‌పై పెట్టేసి డాక్టర్ ముఖం వైపే చూస్తున్నాడు ఏం చెప్తాడోనన్నట్టు. ప్రియ ఖాళీ అయిన కాఫీ కప్పులు తీసుకెళ్ళి పోయింది.

...ఒరేయ్! 'తల్లి కడుపు చూస్తుంది, ఆలి జేబు చూస్తుంది' అంటారు. 'నేటి అమ్మాయి రేపటి అమ్మ, నేటి కోడలు రేపటి అత్త అన్నది సహజంరా. ఏ శాస్త్రం దీన్ని ఖండించ జాలదు.

'తల్లి కడుపు చూస్తుంది. ఆలి జేబు చూస్తుంది'. అంటే ప్రతి అమ్మ ఒకరికి ఆలియే, ప్రతి ఆలి ఒకరికి అమ్మేకదా! అమ్మకు ఆలికి అసమాన కాల పరిమితి ఉండొచ్చు, అంత మాత్రాన అమ్మకంటే ఆలిని పూర్తి విరుద్ధంగా చూడటం సరైంది కాదు. కని పెంచి పోషించిన అమ్మను నిర్లక్ష్యం చేయడమూ సరైంది కాదు.

నేడు నా ఆలి రేపు నాకు పుట్టబోయే పిల్లలకు తల్లే కదా! నేడు నా జేబు చూస్తుంది రేపు నా బిడ్డల కడుపు కోసమే కదా! అని ప్రతి ఒక్కరు తెల్సు కోవాలి. ప్రత్యేకంగా పురుషులు. అంటే జేబులు చూసేది ఆలి మాత్రమే కాదు తల్లి కూడా. కాక పోతే పిల్లలు కాకముందు కేవలం ఆలిగా మాత్రమే కనిపిస్తుంది. కారణం జేబులు చూసేది కేవలం తన కోసం అనే అభిప్రాయం కలుగుతుంది, తల్లి అయిన తర్వాత పిల్లలకోసం అనే అభిప్రాయానికి సహజంగానే మనసు మారుతుంది. పిల్లలయిన తర్వాత తల్లిగా కనిపిస్తుంది. కాని ఆలినీ కాబోయే తల్లిగా గుర్తిస్తే 'ఆలి జేబులు చూస్తుంది–తల్లి కడుపు చూస్తుంది' అనే విషయం అసలు మనసుకే కాదు ఏ మనిషికీ తట్టదు. అసలు ఆ అభిప్రాయమే తప్పు అంటాను.

ఎందుకంటే ఆ విషయం ప్రతి ఇంటికి ప్రతి స్త్రీకి వర్తిస్తుంది. అంటే మన తల్లి, చెల్లి, కూతురు... అందరూ అంతే. ప్రతి ఒక్కరు ఒకరికి తల్లి, ఒకరికి ఆలి కావల్సిందే. ఇది ప్రకృతి ధర్మంరా అన్నాడు. అంతలో తన అమ్మ, భార్య మధ్యనున్న గొడవ కాని, ఇంట్లో ఉన్న పరిస్థితి కాని మరచిపోయి డాక్టర్ చెప్తున్న విషయాల్లో లీనమై పోయాడు. డాక్టర్ చెప్తున్నదంతా ఫిలాసఫీ పాఠం వింటున్న భావనల్లో తేలుతున్నాడు ప్రకాష్.

కొద్ది క్షణాలాగి ప్రకాష్! నేనొక సంఘటన చెప్పనా? అంటూ,

"మిత్రమా! నేనో అమ్మాయిని ప్రేమించాను, తను లేకుండా నేనుండలేక పోతున్నాను. కాని మా అమ్మ ఒప్పుకోవడం లేదు. నా గురించి చాలా బాధ పడుతోంది. నేను ఇద్దరినీ బాధ పెట్టకూడదనుకుంటున్నాను. కాని ఎవరినో ఒకరిని వదిలి వేయక తప్పదు అనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో నేనెవరిని కాదనాలి చెప్పరా!" అంటూ వాపోయాడు ఓ తెలివి పరుడు తన మిత్రుని దగ్గర.

అయితే ఆ మిత్రుడు తనకు తోచిన విధంగా సర్దిచెప్పే ప్రయత్నంలో 'ఒరెయ్! అమ్మ అమ్మేరా, కన్న బిడ్డ తల్లిని కత్తితో పొడిచి చంపబోతుంటే జాగ్రత్త బిడ్డా దెబ్బ తగిలించుకునేవు! అందట వెనకట ఓ మహా తల్లి. అమ్మ ఏనాటికైనా మనల్ని (తన బిడ్డల్ని) అర్థం చేసుకుంటుంది. కొంత సమయం తర్వాత అయినా తన చెంతకు చేర్చుకుంటుంది. కాని ప్రేయసి అలా కాదు. ప్రస్తుతం తప్పిపోతే భవిష్యత్ ఉండదు. అందుకని ప్రస్తుతానికి అమ్మకు దూరమైనా ప్రేయసికి దగ్గరవ్వాలి.

అదే సందర్భంలో ఇంకో ముఖ్య విషయం అంటూ, అమ్మ లాలిస్తుంది, పాలిస్తుంది కాని, ఆలి అమ్మలా లాలిస్తుంది, పాలిస్తుంది, ఆలిస్తుంది... అంటే అమ్మలో ఆలిని చూడలేము కాని ఆలిలో అమ్మను చూడొచ్చురా!

పిల్లలు పుట్టక ముందు వయస్సు, ఆలోచనా అనుభవం, మానసిక పరిపక్వత సహజంగా తక్కువ. వయసుకు తగ్గ అలోచనలుంటాయి. అభిరుచులూ ఉంటాయి. మంచి దుస్తులు, మేకప్ కిట్, ఇంకా కంజ్యూమర్ షాపింగ్, పార్కులు, హొటల్స్, నచ్చిన తినుబండారాలు, పార్కులు, సినిమా షికార్లు... కావాలనుకునే ఆలోచనలు ఇప్పుడే కదా! ఆ తర్వాత ఏం చేయలేము కదా!? అనే అభిప్రాయాలు కూడా సహజమే. ఆ పరిస్థితుల్లో ఒకప్పుడు తల్లి, ఇప్పుడు చెల్లి, ఆ తర్వాత ఆలీ, ఇంకొంత

> ***"మిత్రమా! నేనో అమ్మాయిని ప్రేమించాను, తను లేకుండా నేనుండలేక పోతున్నాను. కాని మా అమ్మ ఒప్పుకోవడం లేదు. నా గురించి చాలా బాధ పడుతోంది. నేను ఇద్దరినీ బాధ పెట్టకూడదనుకుంటున్నాను. కాని ఎవరినో ఒకరిని వదిలి వేయక తప్పదు అనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో నేనెవరిని కాదనాలి చెప్పరా!"***

కాలానికి మన సొంత కూతురు కూడా అంతే... అవునా కదా!? అందుకేరా! ఆలి, తల్లి, చెల్లి ఎవరైనా "స్త్రీ ప్రియమైనది". ఎటువంటి పరిస్థితుల్లోనైనా సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవాలి తప్ప, ఎవరిని వదులు కోవాలి? ఎవరిని ఆదుకోవాలి అనే ఆలోచనే రాకూడదు సుమా! అని సమాధానమిచ్చాడట ఇంకోమిత్రుడు. అంటూ, ఒక్క క్షణమాగి 'చూశావారా, స్త్రీ ఎన్ని బాధ్యతలు మోస్తుందో? ప్రతిదీ తన భర్త, పిల్లల కోసం తప్ప కేవలం తనకోసమంటూ ఎప్పుడూ ఏదీ కోరుకోదురా!

ప్రకాష్, ఇంకో మాట చెప్పనా? ఇది ఒక విధంగా వేదన, ఈ వేదనను పురుషులకంటే స్త్రీలే ఎక్కువ మంది ఎదుర్కొంటున్నారు. ఒక వేళ ఎవరైనా

నీదగ్గరకు వచ్చి "మా అత్తగారి వేదింపులు భరించ లేక పోతున్నా నండీ, మా ఆయన కూడా నా పరిస్థితి గురించి ఏమీ పట్టించుకోవడంలేదు. వేరు కాపురం పెట్టాలంటే వినక పోగా కని, పెంచిపోషించిన అమ్మ నాన్నలకు దూరం కావడం నాకిష్టంలేదు, కొంత కాలం మనమే ఓపిక పట్టాలి. పిల్లలు పెద్ద వారైతే పరిస్థితులు మారతాయి అంటూ నాకే సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వేరు కాపురానికి మా ఆయనను ఒప్పించాలండీ" అంటూ మీకు తెలిసిన అమ్మాయి ఎవరైనా మీతో అంటే ఏం చేస్తావు? వేరే కాపురం పెట్టడమే సమస్యకు పరిష్కారమంటావా? లేక కొంత కాలం ఓపికపట్టి కనిపెంచి, పెద్దజేసిన అమ్మా నాన్నల రుణం తీర్చుకోవడమే ధర్మం అంటావా?

సరైన సమాధానం చెప్పలేవు కదా!? రెండిట్లో ఏది చెప్పినా ఒకరికి న్యాయం జరుగుతుంది. ఇంకొకరికి అన్యాయమే అన్నట్లే. ఇద్దరినీ తృప్తి పరచడం తాత్కాలికంగా అయితే అసాధ్యం కదా? అందుకేరా సంసారం అంటే ముళ్ళ పొదల్లో పరిమళించే పువ్వులాంటిది, దాన్ని ఆస్వాదించాలి. అప్పుడే జీవితం సార్థకత అవుతుంది. అప్పుడే ఓ పరమార్థం ఏర్పడుతుంది.

ఒరే ప్రకాష్! 'సమాధాన పర్చిన మిత్రుడి స్థానంలో నువ్వే ఉండి ఆలోచించు, దానికి సరియైన పరిష్కారం దొరుకుతుంది' అంటూ తన సమస్యకు పరిష్కారం తనే వెతుక్కొనేటట్లు మెదడును కడిగేశాడు డాక్టర్ జగదీష్. దాంతో ప్రకాష్ తేరుకుని 'నువ్వు మానసిక వైద్యుడివిరా' అనుకున్నాడు మనసులో.

- మహేష్ దుర్గే, 9700888972

■ స్ఫూర్తినిచ్చిన గురువు

మర్చిపోలేం

తల్లీ దండ్రి తర్వాత ప్రముఖ స్థానం వహించేది గురువు. అందుకే చాలామంది గొప్పవారు తమ గురువులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించారు. మా అమ్మ ప్రభుత్వ ఉద్యోగిని కావడం వల్ల నా చదువు ఒక్క చోట కాకుండా కొన్ని తరగతులు ఒక గ్రామంలో మరికొన్ని తరగతులు మరో గ్రామంలో... ఇలా సాగింది. నేను నాలుగు నుంచి ఆరవ తరగతి వరకు మెదక్ జిల్లాలోని మేడ్చల్ సమీపంలో గల 'కూచారం' అనే చిన్న పల్లెటూర్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివాను. ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సిద్ధిరాములు మాస్టారు గణితం, వై.రాజ్యం టీచరు తెలుగు బోధించేవారు. మా అమ్మగారు చిన్న పిల్లలకు చెప్పేవారు.

విద్యార్థులందరికీ సిద్ధిరాములు మాస్టారంటే చాలా ఇష్టం. మాకూ చదువుతో పాటు నృత్యాలు, పాటలు, ఆటలు తనే స్వయంగా నేర్పించేవారు. విద్యార్థులకు పొదుపు నేర్పించాలని పాఠశాలలోనే కిడ్డీ బ్యాంకులు పెట్టించారు. జట్టు జట్లుగా పాటలు నేర్పించి, ఏ జట్టు బాగా పాడుతున్నారో ఎన్నుకునేవారు. అలా బాగా పాడించి ఆకాశవాణి 'బాలానందం'కు తీసుకెళ్లారు. అలా మొట్టమొదటిసారి మాస్టారిగారితో ఆకాశవాణికి హైదరాబాద్‌కు వెళ్లడం జరిగింది. ఆకాశవాణిలో మాస్టారిగారి వల్ల రేడియో అక్కయ్య, రేడియో మావయ్యను చూశాం. ఇది ఎన్నటికీ మర్చిపోలేని తీపిగుర్తు. ఆ మాస్టారు ఇచ్చిన స్ఫూర్తి వల్లే నేను కూడా ఉపాధ్యాయినిగా పిల్లలకు నృత్యాలు, పాటలు, చదువు చెప్తున్నాను.

పదో తరగతి తూప్రాన్‌లో చదివాను. అక్కడ రామకృష్ణయ్య మాస్టారు గణితం బాగా అర్థమయ్యేట్టు చెప్పేవారు. చివరి పరీక్షలు అయిపోయిన తర్వాత స్నేహితులందరం విడిపోతున్నామని బాధపడుతుంటే రామకృష్ణయ్య మాస్టారు కుటుంబ సభ్యులందరూ కూడా మా స్నేహ బృందం అందరికీ ధైర్యం చెప్పి సినిమాకు కూడా తీసుకెళ్లారు. ఈ విధంగా గురువుగారి కుటుంబంతో సినిమాకు వెళ్లడం మా స్నేహితులందరికీ మర్చిపోలేని సంఘటనగా నిలిచిపోయింది.

– కరుణశ్రీ,

ప్రగతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్

జోక్స్ కార్నర్

ఆవలింత



భార్య: (ఆవలిస్తూ) అసలీ ఆవలింతలు ఎందుకు వస్తాయండీ?!

భర్త: రెండు కారణాలు, ఒకటి శ్వాస ద్వారా సరిపడినంత ఆక్సిజన్ అందుకపోతే.

భార్య: ఇంకోటి?

భర్త: భర్తంటే భయం లేకపోతే.

ప్రకటన



రామారావు: మా విక్కీ తప్పిపోయి వారం రోజులయింది. ఇంకా ఇంటికి తిరిగి రాలేదు. పాపం ఎలా వుందో, ఎక్కడ వుందో తెలియదు. ఎంత ముద్దుగా వుండేదో తెలుసా? అస్సలు మర్చిపోలేకపోతున్నాను.

శంకరరావు: మీ కుక్కమీద అంత ప్రేమ వుంటే పేపర్‌లో ప్రకటన ఇవ్వొచ్చు కదా.

రామారావు: ఇద్దామనే అనుకున్నాను. కానీ మా విక్కీకి పేపర్ చదవడం రాదు కదా!

తగ్గించండి



జీతం తీసుకొచ్చిన మరుసటి రోజునే బట్టలకొట్టుకు వెళ్ళి చీర కొని తెచ్చుకొన్న భార్యను చూసి భర్త కోపంతో ఇలా అన్నాడు:

భర్త: మరీ అంత చీరల పిచ్చి పనికిరాదు. ఇలా అయితే ఈ సంసారాన్ని ఈదడం నా వల్ల కాదు.

భార్య: నేనూ అదే చెబుతున్నాను. కొంచెం ఒళ్ళు తగ్గించుకోండి. అప్పుడు ఈదడం సులభమవుతుంది.

విశ్రాంతిగా...

భర్త: ఇవాళ ఆదివారం కదా హాయిగా, విశ్రాంతిగా గడపొచ్చని మూడు సినిమా టిక్కెట్లు తీసుకొచ్చా?

భార్య: మూడా? మూడెందుకండీ?

భర్త: నీకు, మీ అమ్మకి, మీ నాన్నకి.

ప్రేలాపన

ఇద్దరు మిత్రులు బాగా తాగి రోడ్డు మీద నడుస్తున్నారు. ఒకడు మురికి కాలువలో పడ్డాడు.

రెండో అతను అతికష్టమ్మీద అతణ్ణి పైకి లాగాడు.

మొదటివాడు ఒంటికి అంటుకున్న బురదను చూస్తూ – " ఈ మున్సిపాల్టీ వాళ్ళకి బుద్ధి లేదురా. పగలు మురిక్కాలువను రోడ్డు పక్కన పెడతారు. రాత్రి కాగానే రోడ్డు మధ్యలోకి లాగుతారు" అన్నాడు కోపంగా.

రక్తం



భార్య: మీరు మొన్న యాక్సిడెంట్ అయినప్పటి నుంచీ మరీ రాక్షసంగా ప్రవర్తిస్తున్నారేమిటి?

భర్త: నేనేం చేస్తాను. అప్పుడు నాకు ఎక్కించింది. నీ రక్తమే కదా?

పదే పదే ఫోను చేస్తున్నారా?

ఎవరయినా ఫోన్లు తమ సౌకర్యం కోసమే తప్ప ఎదుటివాళ్ళ సౌకర్యం కోసం వాడరు. ఎందుకు ఫోన్ చేయవనిగానీ, ఎందుకు ఫోను ఎత్తడం లేదని గానీ డిమాండ్ చేసేవారు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. విధి నిర్వహణలో భాగంగా ఇచ్చే ఫోన్లకు ఈ సూత్రం వర్తించదు. ఎందుకంటే ఉద్యోగులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటూ ఫోను సౌకర్యం కల్పిస్తారు. కనుక ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఆఫీసు నుంచి, బాస్‌ల నుంచి వచ్చే ఫోన్లకు ప్రతిస్పందించాల్సిందే.

➡ పర్సనల్ కాల్స్‌కు సంబంధించి వస్తే ఎవరితో మాట్లాడాలో ఎవరితో మాట్లాడకూడదో ఆయా వ్యక్తుల ఇష్టం. ఇక్కడ ఎవరి డిమాండ్లకు ఆస్కారం లేదు.

➡ అవసరమయిన పనుల మీద ఫోనులు ఒకటి రెండుసార్లు చేసినా ఎత్తకపోతే... ఎస్.ఎమ్.ఎస్. చేయండి. మీ పేరు, ఒక్క నిమిషం మాట్లాడవచ్చా అని మెసేజ్ చేయండి.

➡ క్లుప్తమైన మెసేజ్‌లు చూశాక తిరిగి కాల్ చేసే అవకాశం ఉంటుంది. అందుకని వెంటవెంటనే కాల్ చేసి విసిగించకూడదు.

➡ మీకు పని ఉండి ఫోను చేయొచ్చు. కానీ ఎదుటివారు ఫోను సైలెంట్‌లో పెట్టి మీటింగ్‌లోనో, థియేటర్‌లోనో ఉంటే మీ మెసేజ్ చూశాక కాల్ చేస్తారు.

➡ తమకు తెలియని వ్యక్తులు తమతో మాట్లాడి తీరాలన్నట్టుగా వ్యవహరించకూడదు. ఫోను వారి సౌలభ్యం కోసం మాత్రమే ఉందని గ్రహించాలి. వీలయితే రెండోసారి మెసేజ్ పెట్టాలి.

➡ మీరు ఫోను చేస్తే ఎత్తడం లేదని అతని పక్కన వుండే కోలీగ్స్‌కి ఫోను చేసి అతనితో మాట్లాడాలని ప్రయత్నించకూడదు. అదేవిధంగా ఫలానా వ్యక్తి నుంచి ఫోను అంటూ తమ మిత్రులకయినా సరే అందించకూడదు. ఎందుకంటే మాట్లాడటం ఇష్టం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. ఎదుటివారి ప్రైవసీని దెబ్బతీయకూడదు.

➡ మిత్రులకు, ఆప్తులనుకున్నవారికి కాల్ చేయకుండా రోజులు, వారాలు, నెలలు గడిపేస్తుంటారు కొందరు. అందుకని శని, ఆదివారాల్లో బంధువులకు, పాతమిత్రులకు కాల్ చేయాలి. రెండు రోజుల ముందుగానే ఎవరెవరికో కాల్ చేయాలో జాబితా రాసుకోవాలి. దాని ప్రకారం ఫోను చేసి పలకరించాలి. ఇది మనుషుల మధ్య సంబంధాల్ని బలీయం చేస్తుంది. స్నేహ సంబంధాలు, ఆప్యాయతలు మరల చిగురులు వేస్తాయి.

విశ్వనాథ చమత్కారం



ప్రఖ్యాత సినీనటి జి.వరలక్ష్మి ఒకసారి విశ్వనాథ వారి ఇంటికి వచ్చి, "అయ్యా, నేనొక సినిమా తీస్తున్నాను. అందులో మీరు నటించాలి" అని అన్నదట.

విశ్వనాథ "ఇంతకు ఆ సినిమా పేరేమిటి?" అని అడిగారట.

ఆవిడ "మూగజీవులు" అని చెప్పిందట.

విశ్వనాథ వారు వెంటనే "అమ్మాయి! నేనెంత ఉపన్యాసకుడినో, ఎంత వక్తనో నీకు తెలుసు కదా? అటువంటి వాడిని మూగజీవులలో నటిస్తానా?" అని చమత్కరించి మృదువుగా దాటవేశారట.

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

నెమలీక

కుళ్లిన గుడ్డు నీటిలో తేలుతుందా?

పిల్లలూ... మీకు కోడిగుడ్డన్నా, దానితో చేసే ఆమ్లెట్టన్నా చాలా ఇష్టం కదూ! ఇది ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మీరెప్పుడైనా కోడిగుడ్డును పరిశీలించారా? ఋది మంచిగానే ఉందో, పాడైపోయిందో తెలుసుకున్నారా? కుళ్లి పాడైపోయిన గుడ్డు సాధారణ గుడ్డుకంటే బరువు తక్కువగా ఉంటుంది. అంతే కాదు మంచి గుడ్డు అయితే నీటిలో మునిగిపోతుంది. అదే కుళ్లిపోయిన గుడ్డు నీళ్లల్లో వేస్తే పైకి తేలుతుంది. ఎందుకంటే గుడ్డు లోపలి భాగంలో ఉండే గాలి పూర్తిగా బయటికి పోవడంతో దాని బరువు తగ్గిపోతుంది. అందుకే పిల్లలూ... ఇప్పుడు తెలిసిందిగా, మీకెప్పుడైనా గుడ్డు తినాలనిపిస్తే అది బాగుందో లేదో పరీక్షించండి.



అది ఏది?

ఈ నాలుగు పక్షి బొమ్మల్లో ఒకటి మిగతా మూడింటితో కలవదు. అది ఏదో చెప్పండి.

జవాబు : 4

T	T	S	R	O	U	S	E	R	D
R	S	Q	H	I	R	T	R	C	I
I	U	U	T	O	M	A	E	Y	A
A	T	A	O	N	I	O	C	L	M
N	C	R	S	C	E	N	T	I	O
G	I	E	N	W	S	E	A	N	N
L	R	P	A	P	E	R	N	D	D
E	C	O	N	E	P	I	G	E	C
C	L	R	S	O	V	A	L	R	U
H	E	X	A	G	O	N	E	R	E



ఆకారాలు ఉన్నాయా?

ఈ అక్షర సమూహంలో కిందున్న కొన్ని ఆకారాల పేర్లు ఉన్నాయి. వాటిని గుర్తించండి.

అమాయక చక్రవర్తి

వీరాచారి అనే గురువు దగ్గర విశ్వం అనే అమాయక శిష్యుడు వుండేవాడు. విశ్వానికి తల్లీదండ్రీ, నా అన్న వాళ్లు ఎవరూ లేరు. ఏది చెప్పినా ఎందుకు, ఏమిటని అర్థం చేసుకోలేడు. గుడ్డిగా చెప్పిన పని చేసుకుపోయేవాడు. అతనివల్ల వీరాచారికి చాలా ఇబ్బంది ఉండేది. అయినా అనాథ కావడంతో వీరాచారి విశ్వాన్ని ఏమీ అనేవాడు కాదు, బయటికి పంపకుండా తన దగ్గరే వుంచుకున్నారు.



వీరాచారి కూతురి పెళ్లి నిశ్చయమైంది. ఆ పెళ్లికి కావాల్సిన సామాన్లు తీసుకురావడానికి ఎడ్ల బండి కట్టుకుని పొరుగూరు వెళ్లడానికి ప్రయాణమయ్యాడు. ఆయన వెళ్తుంటే విశ్వం తాను కూడా వస్తానన్నాడు. సరేనని వీరాచారి విశ్వాన్ని కూడా తీసుకెళ్లాడు.

తిరిగి వచ్చేటప్పుడు బండి నిండా సామాను ఉండడంతో వీరాచారి విశ్వాన్ని బండి వెనక నడవమని, కింద పడిన వస్తువులను తిరగి బండిలో వేయమని చెప్పి, తను బండి ముందు నడుస్తున్నాడు.

ఇంటికి ఇంటికి చేరుకున్న తర్వాత వీరాచారి సామానంతా ఇంట్లో పెట్టడానికి బండి వెనకకు వెళ్లి చూశాడు. బండిలోని సంచుల పైనంతా పేడ ముద్దలు కనిపించాయి. ఈ పేడముద్దలన్నీ ఇక్కడికెలా వచ్చాయని విశ్వాన్ని అడిగాడు వీరాచారి. దానికి విశ్వం "మీరేకదండీ... బండిలోనుండి ఏదైనా కిందపడ్తే తిరగి బండిలో వేయమన్నారు. అందుకే పేడ కిందపడ్తుంటే దాన్నంతా మళ్లీ బండిలోనే వేశా" అన్నాడు.

విశ్వం తెలివితక్కువ తనానికి జాలి పడాలో, సామానంతా పాడైపోయినందుకు అతన్ని దండించాలో అర్థం కాలేదు.

ఆస్ట్రిచ్



ప్రపంచంలోకెల్లా పెద్ద పక్షి ఆస్ట్రిచ్. దాన్నే మనం ఈము పక్షి అంటుంటాం. ఇది ఎక్కువగా ఆఫ్రికా అడవుల్లో ఉంటుంది. వీటి సంఖ్య ప్రపంచం మొత్తంమీద రెండు మిలియన్లు ఉంటుందని అంచనా. వీటికి రోగనిరోధక శక్తి ఎక్కువ. ఆస్ట్రిచ్ కన్ను దాని మెదడు పరిమాణం కంటే పెద్దగా ఉంటుంది. ఇది దాదాపు తొమ్మిది అడుగుల ఎత్తు పెరుగుతుంది. అంటే మనిషికంటే ఎత్తుగా అన్నమాట. దీని బరువు 158 కిలోల పైమాటే. ఆస్ట్రిచ్‌కి అసలు నీటి అవసరమే లేదు. ఎందుకంటే అది తీసుకునే ఆహారంలోని నీటి పరిమాణమే దానికి సరిపోతుంది. ఈ పక్షి ఎగరలేదు కానీ గంటకి 40 మైళ్ల వేగంతో పరిగెత్తగలదు. ఇది పెట్టే గుడ్లు కూడా చాలా పెద్దగానే ఉంటాయి. ఆరు ఇంచుల పొడవు, ఒకటిన్నర కిలోల బరువు ఉంటుంది.

వెతకండి

పైన కనిపిస్తున్న వస్తువులు ఈ బొమ్మలోనే దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి.

మొదటిసారి

★ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొదటి వ్యక్తులు – భారతదేశానికి చెందిన టెన్సింగ్ నార్కే, న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ, 1953లో

★ అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి వ్యక్తి – సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీగగారిన్, 1961లో

★ అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి మహిళ – సోవియట్ యూనియన్‌కు చెందిన వాలంటీనా తెరిస్కోవా, 1963లో

★ చంద్రునిపై మొదట కాలు పెట్టినవారు – అమెరికాకు చెందిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, 1969లో

★ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొదటి మహిళ – జపాన్‌కు చెందిన జుంకోతాబి, 1975లో

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారధి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

సెప్టెంబర్ 1845 నుండి ఆగస్టు 1846 దాకా 'జర్మన్ అయిడియాలజీ' రచన కొనసాగించారు మార్క్స్, ఏంగెల్స్. అది రెండు సంపుటాల్లో అయిదు వందల పేజీల దాకా పెరిగింది. వాళ్ల మొదటి సమిష్టి కృషి 'ది హోలీ ఫ్యామిలీ' లాగా ఇందులో కూడా కొందరు వ్యక్తులను ఎద్దేవా చెయ్యటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. "ఇది రాస్తున్నప్పుడు, ఇద్దరు మిత్రులూ పలుసార్లు పగలబడి నవ్వటంతో ఇల్లంతా ప్రతిధ్వనించింది" అని గుర్తు చేసుకుంది లెంచెన్. కాని చివరికి మార్క్స్ కుటుంబానికి మిగిలింది వాళ్ల నవ్వులు మాత్రమే. జర్మనీలో ఎవరూ ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి ముందుకు రాలేదు. మార్క్స్ చెప్పినట్టుగా చివరికి దీన్ని 'ఎలుకలకు ఆహారంగా' వదిలేశారు. అయినప్పటికీ, మౌలిక ప్రయోజనం నెరవేరింది. సబ్జెక్టు గురించి వారికి స్పష్టత వచ్చింది.

1845 శిశిర కాలంలో, లారా పుట్టిన కొన్నాళ్లకే, మార్క్స్ కుటుంబంలో ఆందోళన మొదలైంది. బెల్జియం నుండి కూడా మార్క్స్‌ను బహిష్కరించడానికి ప్రష్యా ప్రయత్నిస్తున్నదని వార్తలు వచ్చాయి. బ్రసెల్స్‌లో జర్మన్‌ల జనాభా పెరిగింది. ఇందులో కొందరు ప్రష్యన్ ప్రభుత్వ గూఢచారులేననటంలో సందేహం లేదు. అప్పటికి మార్క్స్ బెల్జియన్ ఆదేశాలనేమీ ఉల్లంఘించలేదు. బహుశా రాడికల్ శరణార్థులకు అతడు కేంద్రంగా వున్నాడని గూఢచారులు నివేదికలు పంపించి వుంటారు. ఇలాంటి వాళ్లందరూ తమ సరిహద్దులకు ఎంత దూరంగా వుంటే ప్రష్యాకంత క్షేమం. తాను ప్రష్యన్ పౌరునిగా వున్నన్నాళ్లూ ఈ చిక్కులు తప్పవని డిసెంబర్ 1845లో తన (ప్రష్యన్) పౌరసత్వాన్ని వదులుకున్నాడు మార్క్స్.

అంటే యిప్పుడతడు ఏ దేశానికీ చెందడు. నిజానికి దీనివల్ల అతనికి అదనంగా జరిగిన నష్టమేమీ లేదు. ఒకవేళ ప్రష్యా వెళ్లటమంటూ జరిగితే, అతన్ని అక్కడ అరెస్టు చెయ్యటం ఖాయం. అయితే, ఏ ఒక్క దేశానికీ చెందిన వాణ్ణి కాదనుకోవటంలో ఒక విముక్తి భావన వుంది. 1846 ప్రారంభంలో మార్క్స్, ఎంగెల్స్, మరికొందరు మిత్రులు కలిసి 'కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ' ఏర్పాటు చేశారు. దీని లక్ష్యం కార్మికులు, సోషలిస్టుల మధ్య సరిహద్దుల్ని చెరిపెయ్యటం. అవకాశం వచ్చినప్పుడు అందరూ కార్యాచరణకు సిద్ధంగా వుండాలి. ఇప్పుడు సెన్సార్ల బెడద లేకుండా న్యూస్ లెటర్స్ పంపించుకోవచ్చు.

ఇది (కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ) చాలా చిన్న సంస్థ. వాళ్లు చేసిన పని కూడా ఎక్కువేమీ కాదు. కాని మార్క్స్ ఏర్పాటు చేయాలనుకున్న అంతర్జాతీయ సంస్థలకిది తొలి దశ. ఆఫీసు వ్యవహారాలు జెన్నీ చూసుకుంది. ఆమె పని ఎవరికీ అర్థం కాని మార్క్స్ దస్తూరికి సాపు ప్రతి రాయటం (ఆయన జీవిత కాలంలో జెన్నీ, ఎంగెల్స్, మార్క్స్ కూతుళ్లు మాత్రమే ఆ చేతిరాతను చదవగలిగే వారట!). మార్క్స్‌తో ఎంగెల్స్ సమిష్టి కృషి కొనసాగింది. కుటుంబ సభ్యులు కూడా కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ కాలంలో మార్క్స్ కేవలం రోజుకు నాలుగు గంటలు మాత్రమే నిద్రపోగలిగారు. జెన్నీ స్నేహితురాలొకావిడ 'anti 3 or 4° clock - in the morning association' ఏర్పాటు చెయ్యమని సూచించింది. కనీసం ఈ సమయంలోనైనా విప్లవ కార్యకలాపాలపై విశ్రాంతి తీసుకోవాలని ఆమె ఉద్దేశం. ఇది మంచి సలహా. అప్పటికే మార్క్స్, ఎంగెల్స్ ఇళ్లలో అందరూ చికాకు పడుతున్నారు. జెన్నీ జబ్బుగా వున్న తల్లిని చూడటానికి ట్రేసర్ వెళ్లినప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమైంది. మార్క్స్ రెండు పుస్తకాలు రాస్తున్నాడు. అవిగాక, కొత్త రాజకీయ సంస్థ వ్యవహారాలు చూసుకోవాలి. జర్మన్ శరణార్థులందరూ ఎప్పుడూ అక్కడే కూర్చుంటారు. ఇంకా మూడేళ్లయినా నిండని పిల్లల్ని చూసుకోవాలి. ఈ బాధ్యత లెంచెన్‌దే కావచ్చు గాని మార్క్స్ అవసరాలు పట్టించుకోవటానికెవరూ లేరా ఇంట్లో.

మార్చి 30 నాడు ఇంట్లో కమిటీ మీటింగ్ జరిగింది. విలియం వేట్లింగ్ అనబడే ఒక దర్జీ ఆనాడు వేదిక మీద మాట్లాడాలి. సోషలిస్టులలో, కమ్యూనిస్టులలో అతనికి మంచి పేరుంది. మధ్య తరగతి మేధావులను నమ్మని వాళ్లకు అతడే ఆదర్శం. పారిస్‌లో 'లీగ్ ఆఫ్ జస్ట్' సహ సంస్థాపకుడు. రహస్యంగా ప్రచురితమైన "మానవ జాతి ఎలా వుంది? ఎలా వుండాలి?" పుస్తకం రాసిందీయనే. అయితే అతను ఊహాజనిత సోషలిస్ట్. కొంతకాలం జైల్లో గడపటం కూడా కారణం కావచ్చు. అతడు వాస్తవాలకు దూరంగా వున్నాడని మార్క్స్ అభిప్రాయం. సమావేశం ప్రారంభం కాగానే అప్పటి దాకా ఏదో ఆలోచిస్తూ కూర్చున్న మార్క్స్ 'ఉపన్యాసాలు సరే. ఇన్నాళ్లూ మీరు జర్మనీలో చేసిందేమిటో చెప్పండి" అంటూ నిలదీశాడు. కార్మికులకు తమ దైన్య స్థితిని గురించి అవగాహన కలిగించానంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు వేట్లింగ్.

మార్క్స్ మధ్యలోనే అడ్డు పడి, "కార్మికులకు అరచేతిలో స్వర్గం చూపించటం నిజాయితీ అనిపించుకోదు. నీకు నువ్వు ప్రవక్తవనుకుంటే సరిపోదు. నువ్వు మాట్లాడుతుంటే వాళ్ల చేతులు జోడించి నీ వైపు ఆశగా చూడాలా! వాళ్ల పరిస్థితి దయనీయంగా వుందని మళ్లీ మళ్లీ చెప్పనక్కర్లేదు. వాళ్లకూ తెలుసా విషయం. వాళ్ల పరిస్థితికి కారణాలు విశ్లేషించగలగాలి. కార్యాచరణ ఏమిటో స్పష్టం చేయకపోగా వాళ్లను రెచ్చగొట్టడం చాలా ప్రమాదకరం" అంటూ అరిచాడు. వేట్లింగ్ సంజాయిషీ ఇచ్చుకోవటానికి ప్రయత్నించాడు గాని మార్క్స్, బల్లమీద బలంగా గుద్దుతూ (బల్లమీద దీపం పడిపోయేదే!) "అజ్ఞానం వల్ల ఎవరికీ ఉపయోగం!! అంటూ ఉరిమి చూశాడు. అందరూ నిశ్శబ్దంగా నిష్క్రమించారు. కాసేపటికి మార్క్స్ కూడా లేచి గదిలో అటూయిటూ పచార్లు చేస్తూ గడిపాడు.

కోపంతో ఊగిపోతున్నాడు. అగ్ని పర్వతంలోంచి లావా ఉబికి రావటానికి సిద్ధంగా వుంది. (పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేస్తాడు మార్క్స్' అంటూ వ్యాఖ్యానించాడొక మిత్రుడు) కొద్ది రోజులలోనే తన బృందంలోని ఒక జర్మన్ జర్నలిస్ట్ హెర్మాన్ క్రీజ్ మీద దాడి చేశాడు మార్క్స్". సెంటిమెంటల్ యుటోపియన్. ఒక చిన్న వ్యాసంలో ముప్పై అయిదుసార్లు 'ప్రేమ' అనే మాట వాడకుండా ఉండలేదు" అన్నాడు. ఆ తర్వాత పలువురు ఫ్రెంచి, జర్మన్ గొర్రె

దాటు సోషలిస్టులను ఘాటుగా విమర్శిస్తూ కరపత్రాలు ముద్రించాడు. వీళ్లెవరికీ శాస్త్రీయ దృష్టి లేదు. నిజమైన సమస్యలను పరిష్కరించే దారులు వెదకటంలో విఫలమయ్యారు". మాంచెస్టర్‌లో తాను చూసిన దృశ్యాలు ఇంకా కళ్ల ముందర కదలాడుతున్నాయి. మాటలు కాదు. ఉపన్యాసాలు కాదు. పగటి కలల్లో విహరించటం కాదు, సైద్ధాంతిక చర్చలు కాదు. తక్షణ కార్యాచరణ కావాలి. విప్లవం తప్ప మరో మార్గం లేదు.

ఫిబ్రవరి నెలలో పోలెండ్‌లోని గలీషియాలో రైతులు తిరుగుబాటు చేసి వందలాది అగ్రవర్గాల వారిని హతమార్చారు. మార్క్స్‌కు ఇందులో ఓ ఆశాకిరణం కనిపించింది. చరిత్ర గతి ఇలాగే ఉండబోతోంది. ఇది తొలి విప్లవ కెరటం. తిరుగుబాటు క్రాకోకు పాకింది. ఆ పోలిష్ విప్లవంలో అర్ధబానిస విధానం రద్దయినట్టుగా ప్రకటించారు. కాని పది రోజుల తర్వాత తిరుగుబాటు విఫలమైంది. సంస్థాగత నిర్మాణం లేకపోవడం దానికి ముఖ్య కారణం. మార్క్స్ ఇన్నాళ్లూ నొక్కి చెబుతున్నదదే. చరిత్ర గురించిన స్పష్టమైన అవగాహన లేకుండా ఏ విప్లవమూ విజయం సాధించలేదు. కూకటివేళ్లతో పెళ్లగించిన పాత వ్యవస్థ స్థానంలో రాబోయే కొత్త వ్యవస్థ ఎలా వుండబోతోందో అన్న స్పష్టమైన అవగాహన వుండాలి.

గలీషియా తిరుగుబాటు అంతటితో సమసిపోలేదు. దాని ప్రభావం ప్రతి యూరోపియన్ రాజధానిలోనూ ప్రతిధ్వనించింది. ఆహార కొరత, ఆర్థిక సమస్యలతో, ప్రభుత్వాలను నిలదీశారు ప్రజలు. నిరుద్యోగం పెరిగింది.

మార్క్స్‌కు తన కరెస్పాండెన్స్ కమిటీలో చిక్కులు పెరిగాయి. ఇతర దేశాలలో జరుగుతున్న పరిణామాలను తెలియచెప్పే 'విలేకరులు' దొరకలేదు. ఫ్రాన్సు గురించి ప్రూధోను రాయమన్నాడు కాని ఊహించినట్టుగానే అయన సహకరించలేదు.

జెన్నీ పక్కన లేదు. చిక్కులు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఎంగెల్స్ కూడా సమస్యలతో సతమతమవుతున్నాడు. అప్పటికి మేరీ బర్న్స్ ఆయన వద్ద ఆర్నెల్లుగా ఉంటోంది. మార్క్స్, ఎంగెల్స్ కుటుంబాలు సన్నిహితంగా వున్నప్పటికీ – నిజానికి రెండు కుటుంబాలూ కలిసే ఉంటున్నాయి. మార్క్స్, జెన్నీలు, ఎంగెల్స్ గురించి పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. ఎంగెల్స్, మేరీని వివాహం చేసుకోకపోవటం వల్ల జెన్నీ ఆమెను దూరంగా పెట్టి ఉంటుందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. కాని అది అసలు కారణం కాకపోవచ్చు. మోజెస్ హెస్ కూడా తన సహచరిని వివాహం చేసుకోలేదు. మార్క్స్ దంపతులు పారిస్‌లో వివాహం కాని జంటలనేకం చూశారు. వాళ్లతో కలిసి తిరిగారు. మరికొందరు జెన్నీ, మేరీ కన్నా తాను (సామాజికంగా) వున్నతురాలినని అనుకుని వుంటుందని అన్నారు. కాని ఆమెకు అలాంటి వర్గ స్వభావం లేదన్నారు మరికొందరు. మొత్తంమీద కారణమేదైనా మార్క్స్ దంపతులకామె నచ్చలేదు. ఇక వాస్తవానికొస్తే ఇరవై మూడేళ్ల ఐరిష్ ఫ్యాక్టరీ కార్మికుని కూతురికీ, ముప్ఫై రెండేళ్ల ప్రష్యన్ అరిస్టోక్రాట్‌కూ మధ్య అగాధం పూడ్చటం అంత సులభమేమీ కాదు. ఒక సందర్భంలో "ఎంగెల్స్ కోరుకొంటే, విముక్తిని కోరుకుంటున్న అందమైన ఆడపిల్లలెందరో రెడీగా వున్నారు" అంది జెన్నీ. జెన్నీ ట్రేయర్‌లో వున్న సమయంలో ఎంగెల్స్, మేరీల మధ్య ఏదో గొడవ జరిగిన మాట నిజం. ఆమె కొంతకాలం ఇంగ్లండ్ విడిచి వెళ్లింది.

బ్రసెల్స్‌లోని శరణార్థి బృందాలలో కూడా గొడవలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరంలో వున్న సఖ్యత ఇప్పుడు కొరవడింది. మార్క్స్, వేట్లింగ్ పట్ల ప్రదర్శించిన ఆగ్రహానికి నిరసనగా, పార్టీతో సంబంధం తెంచుకుంటానన్నాడు (మార్క్స్ అందరూ తనకు అణిగిమణిగి వుండాలనుకుంటాడు" అని ఆరోపించాడు కూడా). ఎవరి దగ్గిరా డబ్బుల్లేవు – మార్క్స్ పరిస్థితి మరీ అధ్వాన్నం. పుస్తకాన్ని ప్రచురిస్తానన్న ఒక పబ్లిషర్, ఎంతకూ అది పూర్తికాకపోవటంతో, ఆ పుస్తకాన్ని మారెవరితోనన్నా ప్రచురణ చేయించుకుని, తానిచ్చిన 1500 ఫ్రాంకుల అడ్వాన్సు తిరిగి ఇచ్చెయ్యమని లేఖ రాశాడు (ఈ విషయాలేవీ మార్క్స్, జెన్నీకి చెప్పినట్టు లేదు. ఆమె అమాయకంగా, పుస్తకం కోసం జర్మనీలో ఆతృతగా ఎదురు చూస్తున్నారని భర్తకు రాసింది). ఆశ్చర్యమేమంటే, ఎంగెల్స్ కూడా డబ్బు ఇబ్బందుల్లో వున్నాడు. 150 ఫ్రాంకుల విలువ గల వస్తువులు తాకట్టు పెట్టాననీ, డబ్బు త్వరగా పంపిస్తే వాటిని విడిపించుకుంటాననీ తన బావమరిదికి ఓ లేఖ రాశాడు.

'జర్మన్ అయిడియాలజీ'ని జర్మనీలో ప్రచురించటానికి ప్రయత్నిస్తున్న వైడెమీయర్‌కు "రోజులు గడవటం కష్టంగా వుంది. నా దగ్గర వున్న బంగారం, వెండి, దుస్తులు కూడా కుదవపెట్టాను" అని లేఖ రాశాడు మార్క్స్. కాని అంతకన్నా తక్షణ సమస్య మరొకటి వచ్చి పడింది. ఇంటి లీజు ముగిసింది. మరో ఇంటికి మారటానికి డబ్బు లేదు. గత్యంతరం లేక ఎంగెల్స్ వుంటున్న బోర్డింగ్ హౌజ్‌కు మారాడు. కష్టాలు రోజురోజుకూ పెరిగాయే తప్ప తగ్గలేదు.

అయినా మార్క్స్ తన రాడికల్ పథం నుండి పక్కకు మళ్లలేదు. జీవితంలో అలాంటి భావన కూడా ఆయనకెప్పుడూ రాలేదు. డబ్బు లేదు. దొరుకుతుందన్న ఆశలేదు. కొలోన్‌లోని కొందరు వ్యాపారస్తుల్ని అడిగితే ఎంతో కొంత సాయం చెయ్యకపోరు. (కాని రాజకీయ కారణాల రీత్యా వాళ్ల ముందు చేయి చాచటం మార్క్స్‌కు ఇష్టం లేదు). హెస్, ఇతర్లు కూడా ఆదుకునే స్థితిలో లేరు. సరిగ్గా అప్పుడే ఏప్రిల్ 1846లో ఆపన్నహస్తం అందించారొకరు. అనూహ్యంగా ముప్ఫై ఏడేళ్ల విల్హెం వూల్ఫ్ (లూపస్) ఒకనాడు తలుపు తట్టాడు. పత్రికా చట్టాన్ని ఉల్లంఘించినందుకు అరెస్టయ్యేవాడే కాని తప్పించుకుని వచ్చాడు.

....

మార్క్స్ అంకుల్, లయన్ ఫిలిప్, జెన్నీ తల్లి ఇచ్చిన డబ్బుతో మరో మంచి ఇంటికి మారారు మార్క్స్ దంపతులు. జెన్నీ ఏడు నెలల గర్భవతి. తన మూడవ ప్రసవం బోర్డింగ్ హౌజ్‌లో జరగటం ఆమెకిష్టం లేదు. మార్క్స్ రచనల నుండి డబ్బు వస్తుందన్న ఆశ లేదు. తన ఆర్థిక శాస్త్ర గ్రంథం ముగించాడు గాని తిరగ రాయాల్సి వుందన్నాడు మార్క్స్. 'జర్మన్ అయిడియాలజీ'కి ప్రచురణకర్త దొరకలేదు.

ప్రూధో తన ప్రతిపాదనను తిరస్కరించనప్పటి నుండీ, అతడి మీద కోపంగా వున్నాడు మార్క్స్. ఒకప్పుడు అతణ్ణి కీర్తించిన మాట నిజమేగాని, కొంతకాలంగా అందరి ఊహాజనిత సిద్ధాంతాలనూ ఖండిస్తూ, తన శాస్త్రీయ విశ్లేషణలో ముందుకు సాగుతున్నాడు. ఆ క్రమంలో ఇంకా మిగిలిన ముఖ్య ఆర్థిక శాస్త్రవేత్త ప్రూధో ఒక్కడే. తను రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ'తో తనే మార్క్స్‌కు విమర్శించే అవకాశం కల్పించాడాయన. మార్క్స్‌కు డిసెంబర్, 1846లో చేరిందీ పుస్తకం. 'రచయిత ఆర్థిక, చారిత్రక అభివృద్ధి క్రమం అర్థం చేసుకోలేదు' అన్నాడు మార్క్స్. అతడి వాదనలకు ఆధారం 'వాస్తవాలు' కాదు. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి.

(సశేషం)

■ నివాళి

సంగీత కళానిధి



"రాగ జ్ఞానము, స్వర జ్ఞానము రెండూ రెండు ప్రత్యేకమైన అంశాలు. దేనికదే విలక్షణమైనది. పదే పదే వినడం ద్వారా ఎవరయినా రాగజ్ఞానం పొందవచ్చు. అనగ అనగ రాగమతిశయిల్లుచుండు అన్నారు కదా! కానీ స్వరజ్ఞానం అలా కాదు. ఎవరికి వారు తమదయిన ఆసక్తితోనూ, అనురక్తితోనూ కృషి, పట్టుదలతో స్వర జ్ఞానాన్ని సాధించాలి.

ఎక్కువ సంఖ్యలో మంద్రస్థాయిలో (slow tempo) కృతులను నేర్చుకోవడం ద్వారా... వాటిని సాధన చేయడం ద్వారా రాగాలాపనలో ప్రత్యేకత సాధించవచ్చు. ప్రతి సంగీతంలోనూ రెండు మూడు స్థాయి భావాలుంటాయి. సంగీతంలోని అందం ఎక్కడ ఉన్నదంటే, ఈ రకరకాల స్థాయీ భావాలను సమ్మిళితం చేసి రస సిద్ధి సాధించడంలో!

ఆలాపనలో స్థాయి ముఖ్యమైనది. మంద్రస్థాయిలో ఆలాపన ప్రారంభించడంలో ఒక హుందాతనం ఉంది. కానీ దురదృష్టవశాత్తూ ఇప్పుడు ఈ సంప్రదాయం అంతగా కనిపించడంలేదు. గాయకులు ఎకాఎకిన మధ్య స్థాయిని (middle tempo) ఎత్తుకుంటున్నారు. కాలం గడుస్తున్నకొద్దీ కచ్చేరీలు చేసే సమయం తగ్గిపోతున్నది కదా! ఒకప్పుడు రెండు మూడు రోజులు జరిగే కచ్చేరీలు ఇప్పుడు నాలుగు ఐదు గంటలకు కుదించుకుని పోవడం ఇందుకు ప్రధానమయిన కారణం.

మంచి స్వరజ్ఞానం కలిగిన వారికి, మంచి రాగ జ్ఞానం ఉండాలని లేదు. ఈ రెండింటిని అపురూపంగానూ, అద్భుతంగానూ సమ్మిళితం చేయగలిగితే గాయకుడికి తిరుగు వుండదు.

సోమవారం (8.12.2014) ఉదయం విశాఖపట్నంలో రాగ ప్రస్థానానికి ఒక పెద్ద ఫుల్‌స్టాప్ పెట్టిన కర్ణాటక సంగీత మేరు శిఖరం నేదునూరి కృష్ణమూర్తి వివిధ సందర్భాల్లో వెలువరించిన అభిప్రాయాలు ఇవన్నీ. సంగీతంలో తొలి తొలి అడుగులు వేస్తున్న వారందరికీ ఎంతో ఉపయుక్తమయిన విషయాలు.

నేదునూరి కృష్ణమూర్తి ప్రతిభకు ఎల్లలు లేవు. మంద్ర స్థాయిలో మెల్లమెల్లగా మొదలయి, ప్రియుడిని తారాస్థాయికి తీసుకెళ్లి ప్రేమమైకంలో ముంచి తేల్చే ప్రియురాలి గాఢ పరిష్వంగంలాగా ఉంటుంది నేదునూరి రాగాలాపన. పొద్దున్నే లేచి చూస్తే పొగడపూల చెట్టు వాకిలి నిండా పూలు రాల్చి అద్భుతమయిన రంగవల్లికను తీర్చి దిద్దినట్టుగా మైమరపుగా ఉంటుంది కృష్ణమూర్తి గానం.

రసజ్ఞాన పరిమళం, అద్భుతమయిన శైలి, సాంకేతిక సౌందర్యం, లయలో కచ్చితత్వం, మనసును అవలీలగా వశపర్చుకునే మాధుర్యం కృష్ణమూర్తి గానాన్ని అజరామరం చేస్తున్న అంశాలు.

ఒకానొక సంగీత కచ్చేరీలో నేదునూరి, రేవతీరాగంలో పాడిన అన్నమాచార్య కీర్తన "నానాటి బతుకు నాటకమే" విన్న శ్రీమతి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి "డా॥ నేదునూరి ఈ ఒక్క రాగ ప్రస్థానానికే నీకు 'సంగీత కళా నిధి' అనే బిరుదు ఇవ్వవచ్చు. అన్నమయ్య కనుక ఇప్పుడు వుండి నీ పాట వింటే భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకునేవాడు" అని ప్రశంసా పూర్వకంగా అన్నారట.

ఆ ప్రశంసకు నేదునూరి పరమానంద భరితుడై, "అమ్మా! ఇంత గొప్ప ప్రశంసకు నేను తగను. కర్ణాటక సంగీతానికి అనితర సాధ్యమయిన సేవ చేసిన మీరు ఇలా అనడం అంటే అది మీ ఔదార్యం తప్పిస్తే వేరొకటి కాదు" అని వినమ్రంగా జవాబు ఇచ్చాడట.

మరొక సందర్భంలో వేదిక మీద నేదునూరి, ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు లాల్‌గుడి జయరామన్ ఉన్నారు. కృష్ణమూర్తి అధ్యక్షత కాఫీరాగంలో రాగాలాపన చేసి, తనవంతు కొనసాగించవలసిందిగా జయరామన్‌ను కోరారట. జయరామన్ అందుకు సున్నితంగా నిరాకరించి నేదునూరినే పూర్తి చేయవలసిందిగా కోరారట. కచ్చేరీ పూర్తి అయిన తర్వాత "ఎందుకలా చేశారు?" అని జయరామన్‌ని అడిగితే...

"సర్! మీరు రాగాలాపనతో మనోధర్మాంశాలన్నింటినీ వెలువరించాక ఇంకా నాకు ఏమి మిగిలివుంది ప్రతిస్పందించడానికి. మీరు పాడుతూ వుంటే వినడమే ఒక అద్భుతమైన యోగం" అని కృష్ణగాన సభ సెక్రటరీ యజ్ఞరామన్‌తో కర్ణాటక సంగీతంలో ఇతడే విద్వాంసుడు అని చెప్పారట.

నేదునూరి కృష్ణమూర్తి రాగ ప్రస్థానంలో ఇలాంటి మెరుపులు ఎన్నో!

శ్రీపాద పినాకపాణి కృష్ణమూర్తిగారి గురువు. కృష్ణమూర్తితో పాటుగా నూకల చిన సత్యనారాయణలాంటి వారు కూడా శ్రీపాద పినాకపాణి శిష్యరికంలో రాటుదేలినవారు. కృష్ణమూర్తి ప్రతిభకి పినాకపాణి దిద్దిన మెరుగులు ఎన్నో! అందరిలో కృష్ణమూర్తి అంటేనే పినాకపాణికి ఎక్కువ శిష్య వాత్సల్యం.

కృష్ణమూర్తి సంగీతాన్ని వెలిగించేది మనోధర్మం. 'ఏమయ్యా రామా!' అని పది విధాల చేసే నాటకీయ సంబోధన ఆ రాగ పరిధిలోని పారమ్యాన్ని సందర్శిస్తూ పాడడం ఒక్క నేదునూరికే చెల్లుతుంది.

కృష్ణమూర్తి రాగ నివేదనలో సాహిత్యంలోని భావ ప్రకటనలో ఉండే మానసిక సంస్కారం మొత్తాన్ని అందిపుచ్చుకుని శ్రోతకి అందించడం ప్రముఖంగా కనిపిస్తుంది.

కాంభోజి, యదుకుల కాంభోజి, షణ్ముఖప్రియ, ఖరహర ప్రియ, రేవతి, తాడి ఇలా ఏ రాగమయినా కృష్ణమూర్తి స్వరంలో ఒదిగిపోతే, కొత్త అందాలను సంతరించుకోవలసిందే!

మంద్రమయిన స్వరం, సృజనాత్మకమయిన సంగతులు, నెరవులు, శ్రోతల హృదయాలలోని భక్తి భావాన్ని తట్టి లేపే ఉద్వేగపూరిత భావ ప్రకటన కృష్ణమూర్తి గాత్రాన్ని వెలిగించే అంశాలు.

1927 అక్టోబర్ 10న తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం దగ్గర వున్న కొత్తపల్లిలో ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో ఎనిమిదిమంది సంతానంలో చివరివాడుగా శ్వాసనందుకున్నాడు నేదునూరి.

బాల్యంలో దారిద్ర్యం కారణంగా ఎన్నో కష్టాలను అనుభవించాడు. అతడి జ్ఞాన దాహాన్ని తండ్రి తీర్చలేకపోయాడు. నెలకు 20 రూపాయల జీతానికి పిఠాపురం రాజాస్థానంలో పనిచేసే కృష్ణమూర్తి తండ్రి "నువ్వు ఏదయినా చదువుకో ఉచితంగా లభిస్తే" అని చెప్పారు.

హిందీ, సంస్కృతం ఉచితంగా నేర్పించారు కనుక కృష్ణమూర్తి బాల్యంలో హిందీ, సంస్కృతం చదుకున్నాడు. తల్లి పాడే అష్టపదులు, ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు విని కృష్ణమూర్తి బాల్యంలోనే వాటిని పొల్లుపోకుండా తిరిగి పాడేవాడు.

అతడిలోని సంగీత కళాభినివేశాన్ని గమనించిన కల్లూరి వేణుగోపాలరావు అనే స్థానిక విద్వాంసులు ఒకరు కృష్ణమూర్తికి వర్ణాలు, తరంగాలు, అష్టపదులు నేర్పారు.

వేణుగోపాలరావు ఇంట్లో కృష్ణమూర్తి సంగీతాన్ని విన్న అప్పల నరసింహం అనే విజయనగరం తహసీల్దారు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయనగరం మహారాజావారి సంగీతకళాశాలలో కృష్ణమూర్తిని చేర్పించారు.

ద్వారం వెంకటస్వామి నాయుడుగారు అప్పుడు ఆ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఉండేవారు. ద్వారం నరసింగరావుగారు, వెంకటస్వామి నాయుడుగారి మేనల్లుడు వయోలినిస్టుగా వుండేవారు.

ద్వారం నరసింగరావుగారి సలహాతోనే వయోలిన్ పైన ఉన్న మక్కువ చంపుకుని గాత్ర సంగీతం వైపు నేదునూరి మళ్లారు. తన సంగీత జీవితాన్ని మలుపు తిప్పిన రోజును గుర్తు చేసుకుంటూ ఒకసారి నేదునూరి ఇలా చెప్పారు..

"నాకప్పుడు ఇరవై సంవత్సరాలు వుండి ఉంటాయి. కాకినాడలోని సరస్వతీ గానసభ వారు వేణుగాన విద్వాంసుడు 'మాలి' కచ్చేరి ఏర్పాటు చేశారు. ఒక యాక్సిడెంట్ కారణంగా మాలి వస్తున్న ట్రైను ఒంగోలులో ఆగిపోయింది. అతను సమయానికి కాకినాడ రాలేకపోయాడు. అప్పుడు నేను శ్రోతలలో కూర్చుని ఉన్నాను. సరస్వతి గానసభ నిర్వాహకులు మాలి వచ్చేంతవరకు శ్రోతలను సముదాయించవలసిందిగా నన్ను కోరారు.

సరస్వతి గానసభ శ్రోతలు మాలి కచ్చేరిని ఎంత శ్రద్ధగా వింటారో నా కచ్చేరిని కూడా అంతే శ్రద్ధగా విని నన్ను ప్రోత్సహించారు. నా కచ్చేరి మధ్యలో వచ్చిన మాలి కూడా కచ్చేరి ఆసాంతం విని నన్ను ఆశ్చర్యపరిచారు. ఈ సంఘటనను నేను ఎప్పటికీ మర్చిపోలేను."

అప్పటి నుండే నేదునూరి వెనక్కు తిరిగి చూడలేదు. పరంపరగా కచ్చేరీ అవకాశాలు వచ్చి పడ్డాయి. ఆంధ్ర, తమిళనాడు, కేరళ ఇలా దక్షిణాది రాష్ట్రాలు అన్నింటిలో నేదునూరి కర్ణాటక సంగీతానికి ఒక ఐకాన్‌గా మారిపోయారు.

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో డిప్యుటేషన్ మీద మూడు సంవత్సరాలు పని చేశారు నేదునూరి. శ్రీనివాసులు శెట్టి అనే మిత్రుడి బలవంతం మీద అన్నమాచార్య కృతులకు స్వరకూర్పు మొదలుపెట్టిన కృష్ణమూర్తి ఆ తర్వాత దాన్నొక యజ్ఞంగా భావించి 108 కీర్తనలకి కంపోజిషన్ కూర్చారు. 'సుహోలి' లాంటి అరుదైన రాగాలతో అన్నమాచార్య కీర్తనలకి అపురూపమయిన ప్రాచుర్యాన్ని కల్పించారు.

రామదాసు కీర్తనలకి కూడా స్వరకూర్పును చేశారు నేదునూరి. "అన్నమాచార్య కీర్తనలు శృంగార రసభరితం అయితే, రామదాసు కీర్తనలు భక్తి భావన పూరితాలు. భక్తి మోక్షానికి దారి తీస్తుంది కదా! అందుకే రామదాసు కీర్తనలకి కంపోజిషన్ చేయాలి అనిపించింది" అని అన్నారొకసారి నేదునూరి.

"అదంతా మా గురువు శ్రీపాద పినాకపాణి పెట్టిన భిక్ష. దక్షిణాది శైలిలో వున్న అత్యద్భుతమైన, అత్యంత సూక్ష్మమయిన అంశాలు అన్నీ మా గురువుగారికి కరతలామలకం. ఆయన వాటిని అన్నింటినీ తన నుండి నాకు బదిలీ చేశారు" అని వినమ్రంగా చెప్పుకున్నారు నేదునూరి.



శ్రీపాద పినాకపాణి

తెలుగు వాడైన నేదునూరి తమిళ కీర్తనలు పాడుతుంటే విన్న ఒక తమిళ రసజ్ఞుడు నేదునూరి కుటుంబం తమిళనాడు నుండి ఆంధ్రాకి వలస వెళ్లిందా అనే సందేహాన్ని వెలిబుచ్చాడట ఒకసారి. తమిళ డిక్షన్‌ని అలా పట్టుకోవడం ఎలా సాధ్యమయింది?

"అదంతా మా గురువు శ్రీపాద పినాకపాణి పెట్టిన భిక్ష. దక్షిణాది శైలిలో వున్న అత్యద్భుతమైన, అత్యంత సూక్ష్మమయిన అంశాలు అన్నీ మా గురువుగారికి కరతలామలకం. ఆయన వాటిని అన్నింటినీ తన నుండి నాకు బదిలీ చేశారు" అని వినమ్రంగా చెప్పుకున్నారు నేదునూరి.

తన సంగీత యాత్ర మొత్తం మీద యాభైకి పైగా అవార్డులను, పురస్కారాలను అందుకున్న నేదునూరి తన శిష్యులను గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, శోభారాజు, మల్లాది బ్రదర్స్ లాంటి వారిని కర్ణాటక సంగీతానికి కానుకగా ఇచ్చారు.

ప్రతి సంవత్సరం జనవరిలో జరిగే మద్రాస్ మ్యూజిక్ పండుగ, ఏ ఒకటి రెండు సార్లో తప్పిస్తే గత యాభై సంవత్సరాలుగా ఆయన కచేరీ చేస్తూనే ఉన్నారు. ఈ సారి ఆయన లేకపోవడం వలన కలిగే విషాదం మద్రాస్ మ్యూజిక్ అకాడమీని ఇనుప తెరలాగా కమ్మేస్తుందేమో!

నేదునూరి అస్తమయంతో ఒక శకం ముగిసింది కర్ణాటక సంగీతంలో.

– వంశీకృష్ణ, 9573427422

నిన్ను నువ్వు దిద్దుకో...



సమాజమంతా భావ ప్రకటనా నైపుణ్యం మీదే ఆధారపడి ఉంది. మంచిగా ప్రవర్తించు, బాగా మాట్లాడు, నిన్ను నువ్వు తీర్చిదిద్దుకో, ఉన్నతంగా బతుకు అనేదే నేటి యువత నినాదం. ఈ నైపుణ్యాలు అలవడాలంటే సంప్రదాయ ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి. ఆలోచనల్లో కొద్దిపాటి తేడాలతో జీవిత గమనంలో పెద్ద మార్పు వస్తుంది.

ఎలాంటి సమస్యనైనా సున్నితంగా మాట్లాడి, చర్చించుకుని పరిష్కరించేందుకు ప్రాధాన్యతనివ్వడం కొత్త ఆలోచన. కటువైన సందర్భాల్లో కూడా సున్నితమైన పదాలతో మాట్లాడి ఎదుటివారిని గెలుచుకోవడం నేటి పరిస్థితులకు చాలా అవసరం.

పెద్దగా అరిచి చెప్పే అలవాటు, కటువుగా మాట్లాడడం అనే లక్షణాలకు దూరంగా ఉంటేనే సమాజంలో స్నేహితులు పెరుగుతారు. దీనికి నైతికత, విశ్వసనీయత జత కూడితే చేసే పనిలో అనూహ్య ఫలితాలు సాధించొచ్చు. ఇవన్నీ జరగాలంటే బుర్రకు విచక్షణను జోడించాల్సిందే. కోపం, బద్ధకం, ఈర్ష్య, ద్వేషం, అత్యాశ, గర్వం వంటి వాటిని అదుపులో ఉంచుకోవాలి. వాటిని అధిగమించగలిగినప్పుడే సమష్టితత్వంతో బాధ్యతలు చక్కగా పూర్తిచేయొచ్చు.

సమాజంలో ఉన్నతంగా బతకాలంటే గొప్ప తెలివి తేటలుండాల్సిన అవసరం లేదు. ఈ విషయం సమాజంలో గొప్పవారుగా పేరుపొందిన ఎంతోమంది నిరూపించారు. తమను తాము తీర్చిదిద్దుకుంటే అతి సామాన్యులు కూడా అసామాన్యమైన ఫలితాలను సాధించే అవకాశం ఉంది.

మెదడుతో యాంత్రికంగా పని చేయడమే అందరికీ అలవాటయింది. మనసుతో ఆలోచించడం ఎప్పుడో మరుగున పడిపోయింది. గ్లోబలైజేషన్ సమాజంలో పారిశ్రామికాభివృద్ధే కొలమానమై, మేధో బానిసత్వం పెరిగింది. ఒక వ్యవస్థ అభివృద్ధికి అందులోని మానవ శక్తి నైపుణ్యం, క్రమశిక్షణ, విచక్షణతో పని చేయాలి. ప్రతిభను కనబరచాలి.

పునాది వేయకుండా కట్టిన భవనం, వేర్లు తీసేసి పాతిన మొక్క ఎక్కువ కాలం మనలేవు. అలాగే సుగుణాలు లేని జీవితం ఎంత అభివృద్ధి సాధించినా పతనమవుతుంది. ఈ గుణాలకే మనం పదునుపెట్టి పరుగులు తీయించాలి. వాటినే కాపాడుకోవాలి. మనిషి కులం, మతం చేత కాకుండా గుణగణాల వల్ల గొప్పవాడవుతాడన్న విషయం అందరికీ తెలిసిందే. ఎదుటివారు మన వల్ల ఇబ్బందిపడుతున్నారని తెలిస్తే వెంటనే మనల్ని మనం సవరించుకోవాలి. నడత మార్చుకోవాలి. తప్పు సరిదిద్దుకోవాలి.

ఒక సర్వే ప్రకారం మన దేశంలో సాధారణ యువతీ యువకుల శక్తి సామర్థ్యాల్లో 90 శాతం వృథాగా పోతుందట. చాలా కొద్ది శాతమే జాతికి ఉపయోగపడుతుందట. క్రమబద్ధమైన జీవితం లేకపోవడం, విలాస దృష్టి, లక్ష్య నిర్దేశం లేకపోవడమే ఇందుకు కారణం. మనలోని ప్రతికూలాంశాలకు ముకుతాడు వేయాలి. యాంత్రికంగా పని చేసే బుర్రకు, మనసే నైతిక విలువలు, మంచీ చెడ్డా అనే విచక్షణను బోధిస్తుంది.

సముద్రంలోని కెరటాల్లాగానే మనసులోని కోరికలు కూడా ఒకదాని వెంట మరొకటి తయారుగా ఉంటాయి. వాటికి కళ్లెం వేయగల నేర్పు ఎవరికి వారే పెంపొందించుకోవాలి. ఇందుకు పదునైన ప్రణాళిక ఉండాలి. సంకల్పం, ఏకాగ్రత చెదిరిపోనివ్వ కూడదు. మనోతత్వవేత్తల సిద్ధాంతం ప్రకారం మన మెదడు పొరల్లో కోరికల వలయం, విచ్చలవిడి ఆలోచన, విచక్షణ అనేవి ఉంటాయట. ఇష్టం వచ్చినపట్టు ప్రవర్తించమని అవన్నీ రెచ్చగొడుతుంటాయట. తప్పు చేయవద్దు అని హెచ్చరించే విచక్షణను నిర్లక్ష్యం చేస్తే నలుగురిలో నవ్వుల పాలు కావాల్సిందే. వీటిని అదుపు చేయడం సాధ్యమైతే విజయం సాధించినట్టే.

గర్వం దేనినీ నేర్చుకోనివ్వదు. ఎవరి ఆదరాభిమానాన్నీ పొందనివ్వదు. అందరి తాపత్రయం డబ్బు, అధికారం కోసమే! అధికారమున్నప్పుడే చూడాలి అయ్యగారి వైభోగం అంటారు పెద్దలు. ఇది కొంతమంది జీవితంలో నిజమవుతుంది కూడా. వయసు, అధికారం, హోదా ఉన్నప్పుడు వచ్చిన గర్వంతో అందర్నీ దూరం చేసుకుంటే, వయసుడిగిపోయిన తర్వాత ఎవరి సహాయం లభించక అవస్థలపాలు అవ్వాల్సి ఉంటుంది. సమిష్టితత్వం ఉంటే గర్వం దూరమవుతుంది. స్నేహభావంతో దేన్నయినా సాధించొచ్చు.

బద్ధకం, సోమరితనం పెద్ద శత్రువులు. ఇవాళ చేయాలనుకున్న పనిని రేపటికి వాయిదా వేయడం తగదు. అనుకున్న పనిని వెంటనే ఆచరించడానికి ప్రాధాన్యతనివ్వాలి. బద్ధకాన్ని వదలించుకోవాలంటే అవయవాలను అదుపులో ఉంచుకోవాలి. అందుకు యోగా, వ్యాయామం, వాకింగ్ వంటివి గొప్ప సాధనాలు.

మనల్ని మనం కించపర్చుకోవడం ఆత్మన్యూనతాభావం కిందే లెక్క. ఇది మనలోని శక్తి సామర్థ్యాలను నీరు గారుస్తుంది. ఈ పని చాలా కష్టం, చెయ్యను, వెళ్లను, సిగ్గు అనే భావనలు ఆత్మ న్యూనతకు చిహ్నాలు. తన పట్ల తనకు అభిమానం, గౌరవం లేనప్పుడే ఇలాంటి మాటలు వస్తాయి.

వాయిదాల పద్ధతికి స్వస్తి చెబుతారా?

కొన్నిరకాల చిన్నచిన్నపనులు కూడా వాయిదా వేస్తుంటారు చాలామంది. ఇదొక అలవాటుగా మారి వారి ప్రయోజనాల్ని దెబ్బతీస్తుంది. జీవితానందాన్ని మసకబారుస్తుంది. జాగ్రత్తగా ఉండాల్సిన విషయాల్లోనూ వాయిదాలు వేయడం తగదు. అవసరాల్ని, అనారోగ్యాన్ని, పొదుపు చర్యల్ని, పాత అప్పులు తీర్చడాన్ని వాయిదా వేయకూడదు. పరిష్కారం ఏమిటంటారా?



➡ ఒకరాత్రి లేదా ఒక పగలు తీరిగ్గా కూర్చొని ఇప్పటివరకు మీరు వాయిదా వేస్తూ వస్తున్న పనుల జాబితా రాయండి. మీరు చిన్న చిన్న పనులు, చేయగలిగిన పనులు కూడా ఎలా వాయిదా వేస్తున్నారో మీకే తెలుస్తుంది.

➡ మీ పాప అయిదేళ్ళ వయసప్పట్నించి తన పేరు మీద నెలకు వెయ్యి లేదా కనీసం అయిదు వందలు రూపాయలు పోస్టాఫీసులోనో, బ్యాంకులోనో వేస్తూ పొదుపు చేయాలనుకున్నారు. పాప ఇప్పుడు తొమ్మిది తరగతికి వచ్చింది. కానీ అసలు ఖాతానే తెరవలేదు. అయిదు వందలు కాదు కనీసం మూడు వందలయినా పాప పేరు మీద పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతాలో వేస్తే ఎంత ఉపయోగంగా ఉండేదో ఆలోచించండి. సరే, ఇప్పుడు వగచి ఫాయిదా లేదు. ఇప్పుడయినా నెలకు 500 లేదా 300 లేదా 200 అయినా సరే పోస్టాఫీసులో ఖాతా తెరిచి పొదుపు చేయడం ఆరంభించండి.

➡ ఆఫీసుకు వెళ్ళడానికి మీకు ఒక బ్యాగ్ కావాలి. ఆర్నెల్లుగా అనుకుంటున్నారు. కానీ మనసు పెట్టి కొనడానికి ప్రయత్నించిందీ లేదు. చాలాసార్లు బ్యాగు ఉంటే బావుండని తలపోస్తారు. అయినా కొనడాన్ని వాయిదా వేస్తారు. మీకు మీరు ఎంచుకోలేరని సందేహిస్తారు. ఈ సంశయాల్ని వదిలేయండి. కనీసం ఈవారంలో బ్యాగు కొనాలని నిర్ణయం తీసుకొని అమలు చేయండి.

➡ ఇంజనీరింగ్ చదువుతున్న మీ బాబు మీ షూస్‌నే వాడుతున్నాడు. తనకు షూస్ కొందామని అనుకుంటారు గానీ కొనరు. వాయిదాలు వేస్తుంటారు. మీరు వాడిన షూస్ తను వాడుకుంటూ సరిపుచ్చుకుంటున్నాడు. ఫైనల్ ఇయర్‌కు వచ్చినా మీ నిర్ణయం వాయిదాల్లోనే వుంది. ఈ ఏడాదయినా బాబుకు షూస్ కొనాలని జులైలో అనుకున్నారు. ఆ పని ఇప్పటివరకు చేయలేదు. కనీసం రాబోయే పదిహేనురోజుల్లో లేదంటే జనవరి తొలివారంలో కొనడానికి ప్రయత్నించండి.

డబ్బులు లేకపోవడం సమస్య కాదు. వాయిదాలు వేసే స్వభావం చిక్కుల్లో పడేస్తుంది. అందుకని మీ ప్రాధాన్యాలు నిర్ణయించుకోండి. వాటిని అమలు చేయడానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించండి. వాయిదాలు వేస్తూ వచ్చిన పనులు వాటంతటవే చక్కబడతాయి.

క్లార్క్ ఉవాచ

➡ ఏది సాధ్యం, ఏది అసాధ్యం తెలుసుకోవాలంటే సాధ్యం పరిమితులను వాటి అసాధ్యాల్ని చేరుకోవాలి.

➡ రాజకీయ నాయకులు డిటెక్టివ్ కథలు, యుద్ధాల కథలు చదవటం మాని, సైన్స్ ఫిక్షన్ కథలు చదవాలి.

➡ ప్రతి గొప్ప నిపుణుడికి అతడిని వ్యతిరేకించే సమాన ప్రతిభ గల నిపుణుడుంటాడు.

➡ సమాచారం విజ్ఞానం కాదు. విజ్ఞానం విచక్షణ కాదు. విచక్షణ ముందుచూపు కాదు. కానీ ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. మనిషికి అవన్నీ అవసరం.

➡ పాత ఖగోళ శాస్త్రజ్ఞులు మానవుడి భవిష్యత్తును గ్రహాలు నిర్దేశిస్తాయని ఊహించారు. కానీ కొన్నాళ్ళకి గ్రహాల భవిష్యత్తును మానవుడే నిర్దేశిస్తాడు.

➡ మానవ న్యాయమూర్తులు దయ కలవారు. కానీ ప్రకృతి సూత్రాలు దయ లేనివి. వాటిని కరుణించమని వేడుకునే వీలుండదు.

మనలోని శక్తి సామర్థ్యాలను వినియోగించడానికి ఇష్టపడకపోవడం వల్లే సాధ్యంకాదనే తిరస్కార భావన వస్తుందట. ఇలా నిరాశగా మాట్లాడడం మానుకుని, అనుకున్న పనిని పూర్తి చేయడానికి ప్రయత్నించడం ,ఇతరుల నుండి స్ఫూర్తి పొందడం, లక్ష్యానికి అంకితమై ముందుకు సాగడమే ఇందుకు మార్గం. నా ఖర్మ ఇంతే, మన చేతిలో ఏం లేదు అనే ఖర్మ సిద్ధాంతాన్ని వదిలిపెట్టాలి.

మనుషుల మధ్య విభేదాలను పెంచేది కోపం. ఓర్పు లేకపోవడం, షార్ట్ టెంపర్ దీనికి ప్రధాన కారణాలు. కోపం ప్రదర్శించడం వల్ల అయినవారిని దూరం చేసుకోవడమే కాకుండా ఆలోచనా శక్తిని కోల్పోతాం. కుటుంబ సంబంధాలు కూడా తెగిపోవడానికి, ఉద్యోగాలు పోవడానికి కూడా ఇదే కారణమవుతోంది. ఆగ్రహం ఎవర్నయినా నిస్సహాయుల్ని చేస్తుంది. కోపంతో ఎదుటివారిపై పెద్దగా అరిస్తే తాత్కాలిక ఉపశమనం కలిగి, మన ఆధిక్యత రుజువవుతుందేమో కానీ, సమస్యలు పెరుగుతాయి. ఉన్న సమస్యను సున్నితంగా వివరించడమే నేటి ట్రెండ్. ఇలా కాకుండా ఆగ్రహాన్ని ప్రదర్శిస్తే, అలాంటి వారిని కోపాన్ని నిర్లక్ష్యం చేయడమే సరైన మందని నిపుణులు చెబుతున్నారు.

ఎవరైనా ఒకటి రెండు సార్లు పొరపాట్లు చేస్తారు. తిట్లు తింటారు. అది సహజం. అయితే వాటిని అనుభవాలుగా భావించి పొరపాటు సరి దిద్దుకోవడం విజ్ఞత. నిర్లక్ష్యంతో పదే పదే పొరపాటు చేయడం చిత్తశుద్ధి లోపానికి గుర్తు. చేసిన తప్పు కప్పి పుచ్చుకోవడం ఇంకా పెద్ద తప్పు. క్షమాపణ చెప్పుకోవడం చిన్నతనమేమీ కాదు. అది మనిషి ఎదుగుదలకు ప్రతీక.

- బి.మల్లీశ్వరి

నిరతము చింతన మధురమే కాదా?

ఎక్కడ వున్నావు?
ఏం చేస్తున్నావు?
ఎవరితో మాట్లాడుతున్నావు?
నాకంటే నీకు పనులు ఎక్కువా?
వాళ్ళతో ఉప్పర్ మీటింగులేంటి?
మెసేజ్‌లు ఎందుకివ్వలేదు?
కాల్ ఎందుకు చేయలేదు?
అసలు నేను గుర్తున్నానా?

ఇవి అనురాగంతో సంధించే ప్రశ్నలేనా? మనిషిని చూడాలని, మాట్లాడాలని తపించే వాళ్ళ పలుకులు ఇంత కఠినమా?

నిజంగా ప్రేమ ఉంటే ఎదురుచూడగలరు. లక్ష్మణుని కోసం ఊర్మిళ 14 ఏళ్ళు ఎదురు చూసింది. 14 ఏళ్ళు కాదు కదా, 14 గంటలు, పోనీ 14 నిమిషాలు కూడా ఎదురు చూడకుండా మనుషుల్ని నిందిస్తూ పోతే ఆ ప్రేమకు అర్థం ఏమిటి?



ఎదురుచూపు కూడా ప్రేమలో భాగమే. మనిషి ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఆ మనిషి కోసం హృదయం తపించాలి. ఆ తపనల్లోని విరహమూ, వియోగమూ కూడా ప్రేమలో భాగమే.

తలచిన క్షణమే మాట్లాడేందుకు ఫోను, ఇంటర్‌నెట్ వంటి సౌకర్యాలున్నా, నాలుగురకాల పనులు చేస్తే తప్ప మనుగడ సాగించలేని స్థితిలో మనుషులున్నారు. కెరీర్‌లో నెలకు లక్ష రూపాయలు సంపాదించే ఉద్యోగం వస్తున్నా తృప్తి పడటం లేదు. దానిని కూడా వదిలేసి సివిల్స్ కోసమో, పిహెచ్‌డి కోసమో ప్రిపరేవుతున్న కాలంలో వున్నాం. మరో మెట్టు ఎక్కాలని, మరో ఉన్నతస్థాయిని అందుకోవాలని ఆశిస్తున్నారు. అంతమాత్రాన ప్రేమలుండవని కాదు. అయితే ప్రేమే జీవితమనుకునేంత అమాయకత్వం ఇవాళ లేదు. ఉండాలనీ ఆశించక్కర్లేదు. ప్రేమ జీవితంలో భాగమే తప్ప ప్రేమే జీవితం కాదు.

ప్రేమ జీవితాన్ని వెలిగించేదిగా ఉండాలి. తన ఆశయ సాధన దిశగా సాగిపోయే మనుషులకు ఉద్దీపన కావాలి. అలాంటి ప్రేమనే యువతరం ఆశిస్తోంది. అందుకని ఎక్కడ, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో ఆశించకుండా మాటలనీ, కాలాన్ని డిమాండ్ చేస్తే కుదరదు. ఈ విషయంలో కాస్త ఏమరపాటుతో ఉండే యువకులుగానీ, యువతులు గానీ ఎదుటి వ్యక్తిపై ప్రేమ, వాత్సల్యం ఉన్నప్పటికీ వెంటనే కమిట్ కావడం లేదు. ఒక్కసారి కమిట్ అయితే ఉండే నానా గందరగోళాన్ని చుట్టూ ఉండే మిత్రుల అనుభవాల్లోంచి చూస్తున్నారు.

అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఫోన్లు అటెండ్ చేయాలి. ఎప్పుడు రమ్మంటే అప్పుడు వెళ్ళాలి. వాళ్ళ కెరీర్‌కు అనువుగా తమ కెరీర్ మార్చుకోవాలి. ప్రతి చిన్న పని చేసి పెట్టాలి. చేయకపోతే కోపాలు. కాల్ అటెండ్ కాకపోతే అలకలు, చివాట్లు. దారిలో సహోద్యోగిని లేదంటే సహ విద్యార్థిని కలిసి విష్ చేసినా రుసరుసలు... ఎందుకింత నస అనుకునే పరిస్థితులు ఏర్పడతాయి.

అందరూ ఇలా ఉంటారని కాదు. కానీ ఎక్కువమంది ఇలానే వున్నారు. స్వీయగౌరవం, ఆత్మాభిమానం గలవారి ప్రవర్తన ఇందుకు భిన్నం. ప్రేమించే మనిషి గురించి ప్రేమపూరితంగా ఆలోచిస్తారే తప్ప, అనుమానపుటాలోచనలు రానివ్వరు. ఇవాళ ఉద్యోగాలు చేసే స్త్రీ పురుషులు ఏకకాలంలో వేర్వేరు జిల్లాల్లో, వేర్వేరు రాష్ట్రాల్లో, వేర్వేరు దేశాల్లో ఉండాల్సివస్తుంది. అనేకమందితో కలిసి పనిచేయాలి. గ్రూపు లీడర్లుగా తమని తాము నిరూపించుకోవాలి. ఎక్కడికంటే అక్కడికెళ్ళి పనులు నెరవేర్చాలి.

ఇది ఇవాళ్టి వాస్తవం. అందుకని ఎంతగా ప్రేమించినా ఎదుటి మనిషి ప్రేమని డిమాండ్ చేయరు. వారి ఏకాంతాన్ని భగ్నపరచరు. వృత్తికి ఎక్కువ సమయం కేటాయించాల్సివస్తే అర్థం చేసుకుంటారు. ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఆ మనిషి మనసులో తాను ఉన్నానన్న వాస్తవం ఒక గొప్ప రిలీఫ్. తనని తలచుకోగానే అతడు సకల సమస్యలు మరిచి గొప్ప ఓదార్పును పొందాలన్న భరోసా అతని/ఆమె ప్రేమ ఇవ్వాలి. ప్రియ నెచ్చెలి/నెచ్చెలుని ఊహ గొప్ప ఉల్లాసాన్నీ, ఉత్తేజాన్నీ ఇవ్వాలి.

తమ తపనల, ఆరాటాల, ప్రేమ పారవశ్యాల వ్యక్తీకరణ సున్నితంగా ఉన్నప్పుడే ఇది సాధ్యం. అంతేగానీ ఎదుటి మనిషిని నొప్పించి, బాధపెట్టి, వేధించి, నిందించి ప్రేమలో నిలుస్తామనుకోవడం పొరపాటు. అర్థం చేసుకోవాలి. అనురాగంతో మెలగాలి. ఎదురుచూపులోని తియ్యదనాన్ని అనుభవించాలి. 'నిరతము చింతన మధురమే' కదా అని తెలుసుకోవాలి.

రోజూ చూడలేకపోవచ్చు. 24 గంటలు మనిషి ఎదురుగా ఉండకపోవచ్చు. 'క్వాలిటీ ఆఫ్ టైమ్' ముఖ్యం అని గుర్తుంచుకోవాలి. కలిసి గడిపే సమయం రాగరంజితం కావాలి. మరల మరల కలుసుకోవాలనేంత మధురానుభూతుల్ని మిగల్చాలి. అందుకే ప్రేమ ఎంత సున్నితమో, ప్రేమ వ్యక్తీకరణలు, ప్రేమమయమైన మాటలు కూడ అంతే సున్నితంగా ఉన్నప్పుడే ప్రేమ నిరంతరం పరిమళిస్తుంది.

– ప్రణీత్

ఋతువులతో సంబంధం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా మొగ్గ తొడిగి, వికసించే అపురూపమైన పుష్పం– ప్రేమ.
– ఖలీల్ జిబ్రాన్

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

ఆండ్రాయిడ్ ఫోన్లకు వైరస్

స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తోంది ఆండ్రాయిడ్. కొత్తకొత్త వెర్షన్లను రిలీజ్ చేస్తూ మొబైల్ ఫోన్ అనుభవాన్ని సమూలంగా మార్చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్ కంప్యూటర్ల కోసం తయారు చేసిన ప్రత్యేకమైన ఆపరేటింగ్ సిస్టమ్. ఓపెన్ హ్యాండ్‌సెట్ అలయెన్స్ అనే సంస్థ ఆలోచనల ఫలితంగా రూపుదిద్దుకుంది. కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేసిన లైనక్స్ ఆపరేటింగ్ సిస్టమ్ కెర్నల్ ఆధారంగా ఆండ్రాయిడ్ రూపుదిద్దుకుంది. నాలుగేళ్ల క్రితం మొదటిసారి 'హెచ్‌టీసీ డ్రీమ్' స్మార్ట్‌ఫోన్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశించింది. అప్పటి నుంచి స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపుతోంది.

ఓపెన్ సోర్స్ పద్ధతిలో అభివృద్ధి చేసిన ఓఎస్ కాబట్టి... వినియోగదారులు తమకు నచ్చిన రీతిలో దీన్ని మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్‌ల ద్వారా ఇది సాధ్యం కాదు. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కంపెనీ గూగుల్ దీన్ని రూపొందించడం కూడా ఆండ్రాయిడ్ ప్రాచుర్యానికి మరో కారణంగా చెప్పొచ్చు. 2009లో విడుదలైన వెర్షన్ పేరు 'కప్ కేక్'.



ఈ నేపథ్యంలో ఆండ్రాయిడ్ ఫోన్లకు వైరస్ అంటూ వచ్చిన వార్త వినియోగదార్లను ఆందోళనకు గురిచేసేదే. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు వాడే వారు జాగ్రత్తగా ఉండాల్సిందేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓ ట్రోజన్ వైరస్ ఫోన్ నుంచి కీలక సమాచారాన్ని దొంగిలించడమే కాకుండా, మొబైల్ చిరునామా జాబితాలోని నెంబర్లకు అక్రమ ఎస్ఎంఎస్‌లు పంపుతుందని స్పష్టం చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ వైరస్‌ను 'ఆండ్రాయిడ్‌ఎస్ఎంఎస్‌సెండ్'గా గుర్తించారు. మరో నాలుగు మారుపేర్లతోనూ ఉండే ఈ వైరస్ ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ఫోన్లను ఉపయోగించే వినియోగదారులను ఏమార్చి విధ్వంసానికి పాల్పడుతుంది. ఇది చట్టబద్ధమైన అప్లికేషన్ల ద్వారానే వ్యాపించి, ఆండ్రాయిడ్ ఆధారిత ఫోన్లను దెబ్బతీస్తుంది. ఒకసారి ఫోన్ వ్యవస్థలోకి చేరిపోయాక.. కాంటాక్ట్ జాబితాలోని నిర్దిష్ట నెంబర్లకు సందేశాలనూ పంపుతుందని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా (సీఈఆర్‌టీ–ఇన్) బృందం తెలిపింది. ఈ మేరకు దేశంలోని ఆండ్రాయిడ్ వినియోగదారులను హెచ్చరించింది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్స్ ఈ వైరస్ ఎటాక్ నుంచి దూరంగా ఉండచ్చు. విశ్వసనీయతలేని చోట్ల నుండి అప్లికేషన్స్‌ను ఇన్‌స్టాల్ చేయకూడదు. మొబైల్‌ను యాంటి వైరస్‌తో స్కాన్ చేస్తూ ఉండాలి. సెక్యూరిటీ లేని సరిగ్గా తెలియని వైఫై నెట్వర్క్‌ను ఉపయోగించకూడదు. ఎప్పటికప్పుడు డేటాను బ్యాకప్ చేసుకోవడం మంచిదని ఈ సంస్థ సూచించింది.

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న స్మార్ట్‌ఫోన్లలో అత్యధికం ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌నే వాడుతున్నాయి. దీనికింత క్రేజ్ పెరగడానికి అనేక కారణాలున్నాయి. వందల, వేల ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉపయోగించుకునే వెసులుబాటు ఉండటం వీటిల్లో ముఖ్యమైన కారణం. ఓపెన్ సోర్స్ పద్ధతిలో అభివృద్ధి చేసిన ఓఎస్ కాబట్టి... వినియోగదారులు తమకు నచ్చిన రీతిలో దీన్ని మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్‌ల ద్వారా ఇది సాధ్యం కాదు. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కంపెనీ గూగుల్ దీన్ని రూపొందించడం కూడా ఆండ్రాయిడ్ ప్రాచుర్యానికి మరో కారణంగా చెప్పొచ్చు. 2009లో విడుదలైన వెర్షన్ పేరు 'కప్ కేక్'. ఆ తరువాత డోనట్, ఇక్లేయిర్, ఫ్రోయో, జింజర్‌బ్రెడ్, హనీకూంబ్, ఐస్‌క్రీమ్ శాండ్‌విచ్ పేర్లతో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసిన వెర్షన్లను విడుదల చేస్తూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వెర్షన్ జెల్లీబీన్. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లలో ఆండ్రాయిడ్ ద్వారా కలిగే ప్రయోజనాల్లో కస్టమైజేషన్ ప్రధానమైనది. మనకు నచ్చిన వెర్షన్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. లైనక్స్‌లోని ఉబుంటూ, రెడ్‌హ్యాట్ ఫ్లేవర్ల మాదిరిగా. ఇక గూగుల్ ప్లేతో అందుబాటులోకి వచ్చే అప్లికేషన్ల సంగతి సరేసరి. రకరకాల గేమ్స్‌తో పాటు రోజువారీ ఉపయోగపడే అనేక అప్లికేషన్లు దీంట్లో ఉంటాయి. ప్రస్తుతం తాజాగా వస్తోన్న స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలోనూ ఈ రకమైన ఫీచర్స్ ఉన్నప్పటికీ ఆండ్రాయిడ్‌లో ఎక్కువగా ఉన్నాయి. ఇక విడ్జెట్ల గురించి చెప్పాలంటే... నిర్దిష్టమైన పనులు చేసిపెట్టే అప్లికేషన్లను విడ్జెట్‌లు అనొచ్చు. రకరకాల పనులను సౌకర్యవంతంగా చేసిపెట్టే ఈ విడ్జెట్స్‌ను గూగుల్ ప్లే నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోవాలంటే అకౌంట్ కావాల్సివుంటుంది. ఇది ఫోన్ డేటాను కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లతో సింక్ చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతుంది.

ఇన్ని ఉపయోగాలున్న ఆండ్రాయిడ్ ఓ ట్రోజాన్ వైరస్ బారిన పడడం ఆందోళనకరమే అయినా.. సీఈఆర్‌టీ–ఇన్ సంస్థ సూచించిన మాదిరిగా కొన్ని జాగ్రత్తలను తీసుకుంటే డేటాను సురక్షితంగా వుంచుకోవచ్చు.

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం ■ **సమీక్షలు**



సిద్ధాంత సమస్యలు
మాకినేని బసవపున్నయ్య
అనువాదం :
వి.ఆర్.బొమ్మరెడ్డి
తెలకపల్లి రవి
పేజీలు : 142, వెల : 60/-
ప్రతులకు : ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు, 040-27660013

ఎగిరే పావురమా
కోసూరి ఉమాభారతి
పేజీలు : 184
వెల : 100/-
ప్రతులకు :
నవోదయ పుస్తక కేంద్రాలు



హాస్యామృతం
రాయవరపు విశ్వనాథ్ ప్రభు
పేజీలు : 120
వెల : 75/-
ప్రతులకు :
అన్ని పుస్తక కేంద్రాలు

కథానిక వస్తు రూపాలు
విహారి
పేజీలు:162, వెల : 120/-
ప్రతులకు :చినుకు పబ్లికేషన్స్, దత్తాస్ నయా బజార్, రాజ్ యువరాజ్ థియేటర్ ఎదురు, గాంధీనగర్, విజయవాడ. విశాలాంధ్ర, నవోదయ పుస్తక కేంద్రాలు



చీర పజ్యాలు, బ్నిం
పేజీలు : 32, వెల : 30/-
(5 పుస్తకాలు 100/-)
ప్రతులకు : బ్నిం, 12-11-448, వారాసిగూడ, సికింద్రాబాద్
ఫోన్ : 9866107289



బహుముఖ ప్రజ్ఞాశాలి

డా॥దేవరాజు మహారాజు 'ఆవరణం',
సంపాదకత్వం : డి.కృష్ణకుమారి, జీవన ప్రచురణలు, హైదరాబాద్,
వెల : 200/-, పేజీలు : 309, ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాలు.

ఒక కవిగా, రచయితగా అప్రతిహతంగా అర్ధ శతాబ్ది కాలం పాటు అన్ని ప్రక్రియల్లో కృషి చేస్తూ, అన్నింటిలో తనదైన ముద్ర వేసుకుని భాషా సాహిత్యాలకు సంబంధం లేని వృత్తిలో వుండి సాహిత్యరంగంలో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి దేవరాజు మహారాజు. వృత్తిరీత్యా జంతుశాస్త్ర ఉపన్యాసకులైన దేవరాజు మహారాజు గారి ప్రవృత్తి ఆంగ్లాంధ్ర సాహిత్యాధ్యయనం, పరిశోధనం. లోతైన పరిశోధనా దృక్పథం, అనుశీలనం ఆయనలోని ప్రత్యేకతలు.

తెలంగాణ మాండలికంలో కవిత-కథ చెప్పి మెప్పించి, కవిగా కథకుడిగా స్థిరపడ్డారు. వ్యవహారిక భాషలోనే కాకుండా, అనువాద కవిత్వం కూడా రాసి అనేక సంకలనాలు వెలువరించి కవి ప్రశంసలను అందుకున్నారు. కథకుడిగా 'కడుపుకోత' మాండలిక కథలే కాకుండా 'పాలు ఎర్రబడ్డాయ్' దేవరాజు మహారాజుకథలు' అనే సంపుటాలు వెలువరించారు. అలాగే డెబ్బయి మంది భారతీయ కథానికా రచయితల్ని వారి కథలతో సహా పరిచయం చేశారు. 'విశ్వకథా సాహితి' శీర్షికన ప్రపంచ ప్రఖ్యాత కథకుల కథల్ని తెలుగులోకి అనువదించారు. పిల్లల కోసం రాసిన జానపద కథలు నాలుగు సంపుటాలుగా వెలువడ్డాయి. ఆధునిక యుగ వైజ్ఞానిక స్పృహతో జానపద సాహిత్య పరిశీలన చేశారు. సమాజంలో శాస్త్రీయ అవగాహన పెంచడానికి విజ్ఞాన శాస్త్ర గ్రంథాల్ని ప్రచురించారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సమాంతర సినిమాను విశ్లేషించారు. విమర్శకుడిగా, పరిశోధకుడిగా పుస్తకాలు తీసుకువచ్చారు. బాల సాహిత్యంలోనూ, రేడియో, నాటక రంగంలోనూ కృషి చేశారు. తెలుగు అకాడమీ పుస్తకాలకు రచయితగా, సంపాదకుడిగా వ్యవహరించారు.

నిరంతర అధ్యయనశీలిగా, సద్విమర్శకుడిగా, అలుపెరగని రచయితగా, స్నేహశీలిగా గుర్తింపబడిన డా॥దేవరాజు మహారాజు సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా ప్రముఖులు రాసిన వ్యాసాలతో వెలువడిన పుస్తకమే ఈ 'ఆవరణం'. ఈ వ్యాసాలు దేవరాజు మహారాజు జీవితం-సాహిత్యం గురించి కాకుండా ఆయన బహుముఖ ప్రజ్ఞను తెలియజేస్తాయి.

- కె.పి.అశోక్‌కుమార్

భూమయ్య కథల్లో వినోదం, చైతన్యం

భూమి యింకా గుండ్రంగానే వుంది... (కథల సంపుటి)
రచన: నల్ల భూమయ్య, పేజీలు: 136, వెల: రూ. 60.
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

తెలంగాణ జీవితంలోని విభిన్నాంశాల్ని చిత్రిస్తూ నల్ల భూమయ్య కథలు రాస్తుంటారు. 'భూమి యింకా గుండ్రంగానే వుంది...' శీర్షికన వారి కథల్ని తెలంగాణ సాహితి పబ్లికేషన్స్ వెలువరించింది. దీనిలో 21 కథలున్నాయి. సమాజంలోని అనేకరకాల సంఘటనలు భూమయ్య కథలకు ఇతివృత్తాలు. తెలంగాణ మాండలిక సొగసులు కథల్లో కనిపిస్తాయి. ముందుమాట రాసిన అంపశయ్య నవీన్ చెప్పినట్టు వినోదాన్ని అందించే గుణం కూడా ఈ కథల్లో వుంది. మొత్తం కథలు సీరియస్‌గా ఉండక్కర్లేదు. పాఠకులకు ఆహ్లాదాన్ని అందించే గుణం కూడా మంచిదే. వినోదంతోపాటు సామాజిక చైతన్యం అందించే అంశాలు ఈ కథల్లో ఉన్నాయి. అందుకే భూమయ్య కథల్ని పాఠకులు సులువుగా చదువుకోగలరు. ఈ పుస్తకానికి కర్రా ఎల్లారెడ్డి సంపాదకులుగా వున్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాల విశ్లేషణ



సాయుధ తెలంగాణ పోరాటం- వాస్తవాలు
మాకినేని బసవపున్నయ్య
పేజీలు: 327 వెల: 150/- రూ
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు
ఫోన్: 040-27660013

తెలుగు ప్రజల విప్లవ సాంప్రదాయాలకు అత్యంత గర్వ కారణమైన తెలంగాణా వీరోచిత సాయుధ రైతాంగ గెరిల్లా పోరాటంలో అసువులర్పించిన అమర వీరులకూ, అనేక కష్టనష్టాలకు, నిర్బంధాలకు, ఘోర హింసాకాండకు గురైనా అశేష ప్రజానీకానికి ఈ గ్రంథాన్ని అంకితం చేసారు. ఇది ప్రజాశక్తి ప్రచురణల్లో విశిష్టమైనది. మాకినేని బసవ పున్నయ్య భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంత కర్తల్లో అత్యున్నతులు. అగ్రశేణి సిద్ధాంతవేత్త. ఇప్పుడు ఆయన శతజయంతి జరుగుతున్న సంవత్సరం ఆయన రచనలు అన్నింటిలో ప్రధానమైన; సిద్ధాంత సమస్యలు? వామపక్ష రాజకీయాలు సిపిఎం, విధానాలు; స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర...నా జ్ఞాపకాలు; "మార్క్సిస్టు యోధులు మార్గ దర్శకులు".. తెలంగాణా పోరాటం- వాస్తవాలు...లాంటి మహత్తర గ్రంథాలు ప్రజాశక్తి ముద్రించింది. గత రెండు వందల ఏళ్ళ చరిత్రలో తెలంగాణా పోరాటంతో పోల్చదగిన ఉద్యమం మరొకటి లేదు. సాయుధ పోరాటం విజయాలు సాధించింది. అనేక సైద్ధాంతిక సమస్యలను ముందుకు తెచ్చింది. ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ఈ పుస్తకంలో ఎం.బి రాజకీయ ఎత్తుగడల, సైద్ధాంతిక సమస్యలను అందరికీ అర్థం అయ్యేలా చర్చించి; చారిత్రక పత్రాలు-విశ్లేషణలు ఉద్యమ పోరాటానుభవ సారంతో అందించారు. ఈనాటికీ ప్రధానాంశంగా వున్న భూసంస్కరణల అమలు సమస్య; వీరతెలంగాణా రైతాంగ పోరాట అసమాన చారిత్రక ప్రాధాన్యత- మిత వాద కమ్యూనిస్టుల వక్ర భాష్యాలు; దివాళాకోరు రాజకీయ సూత్రీకరణలు; పోరాటానికి సంబంధించిన డాక్యుమెంట్లు; 1951 మే నాటి కేంద్ర కమిటీ ప్రకటన; సాయుధ పోరాట వివరణకు కారణాల వివరణ; అజయ్ ఘోష్‌చే హైదరాబాద్‌లో పోటీ పార్టీ కమిటీ ఏర్పాటు; పార్టీని విచ్ఛిన్నంచేసే ముఠాతత్వ ధోరణులు, రావి నారాయణ రెడ్డి రాసి పంచిన "తెలంగాణా నగ్న సత్యానికి విశాలాంధ్ర కమిటీ సమాధానం, ఎన్నికలలో కమ్యూనిస్టుల విజయాలు, కాంగ్రెస్ కుట్రలు రాజేశ్వరరావు ధోరణి; వామపక్షల్లో (సైద్ధాంతిక) భేదాభిప్రాయాలు... అమర వీరుల త్యాగాలు వమ్ము కావు... అనే అధ్యాయాలు... విద్యార్థులకు, రాజకీయాల్ని అధ్యయనం చేసేవారికి ఉపయుక్తం. ఈ గ్రంథానికి సీతారాం ఏచూరి ముందుమాట రాసారు.

ఎంతో విలువైన చారిత్రక పత్రాల విశ్లేషణకు ఈ గ్రంథం సజీవ సాక్షి-అధ్యయన వాదుల కరదీపిక, సాయుధ పోరాటం విరమణపై నేటికి సాగే కట్టు కథలకు జవాబు ఈ గ్రంథం.

- తంగిరాల చక్రవర్తి, 9393804472

అక్షరాల్ని ఆయుధాలుగా సంధించిన కవిత్వం



మోత (కవితా సంపుటి)
రచన: అంబటి నారాయణ, పేజీలు: 144,
వెల: రూ. 70. ప్రతులకు: ఏ.సుకన్య, శాస్త్రినగర్, నిర్మల్-504 106, సెల్: 98493 26801

సమాజ గమనంపై స్పందించే స్వభావం, రాయకుండా ఉండలేని తనం గల కవులు సాహిత్యరంగంలో కొనసాగుతారు. వారి కవితా వ్యాసంగం నిరంతరాయంగా కొనసాగుతుంటుంది. ఈ కోవకు చెందిన కవి అంబటి నారాయణ. ఇప్పుడు అయిదో కవితా సంపుటి 'మోత' వెలువరించారు. దీనిలో 66 కవితలున్నాయి. తెలంగాణ సందర్భంతోపాటు విభిన్నాంశాలపై సృజించిన కవిత్వం దీనిలో ప్రతిఫలిస్తుంది. తోడిశెట్టి పరమేశ్వర్, కారం శంకర్‌లు రాసిన ముందుమాటలు ఈ కవిత్వ సారాంశాన్ని చెబుతాయి. సమాజంలోని సంక్షుభిత వాతావరణాన్ని, తెలంగాణలోని బహుళ పార్శ్వాల్ని, జీవిత రహస్యాల్ని కవిత్వీకరించారు నారాయణ. రైతుల్ని, మహిళల్ని, స్నేహితుల్ని, పోరాటకారుల్ని, అర్ధాంగిలోని అమ్మతనాన్ని మంచి కవిత్వంగా మలిచారు. ఒక్కమాటలో చెప్పాలంటే తను చేరాలనుకున్న లక్ష్యం దిశగా అక్షరాల్ని ఆయుధాలుగా సంధించారు. పుస్తకం శీర్షిక 'మోత' అర్థవంతంగా వుంది.

- శశాంక

అపారమైన అధ్యయనానికి అక్షర రూపం

అంబేద్కర్-లోహియా, డా॥కత్తి పద్మారావు, పేజీలు : 120, వెల : 100/-, ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, లోకాయుత ప్రచురణలు, లుంబినీ వనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు, గుంటూరు. సెల్ : 9849741695. విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ పుస్తక కేంద్రాలు.

ఎవరి నేపథ్యం నుండి వాళ్ళు, ఎవరి మూలాల్నుంచి వాళ్ళ పలుకుతున్న సందర్భంలో దళిత కవి, సామాజిక సాంస్కృతిక ఉద్యమాల ప్రవర్తకుడు డాక్టర్ కత్తి పద్మారావు గారి ఈ పుస్తకాలు సరైన సమాధానం. డా॥బి.ఆర్.అంబేద్కర్ గూర్చి విస్తృతంగా అధ్యయనం చేసిన మేధావి. అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, గ్రంథాలయాన్ని స్థాపించారు. అంబేద్కర్-గాంధీ, అంబేద్కర్-మార్క్స్, పూలే, ప్రపంచ విజేతలు, వ్యక్తిత్వ నిర్మాణం పేరుతో షేక్స్‌పియర్, చార్లీ చాప్లిన్, కార్ల్‌మార్క్స్, అంబేద్కర్-లోహియా ఇటీవల రెండు పుస్తకాలు లోకాయుక్త ప్రచురణలుగా వచ్చాయి. దేశ, సామాజిక రాజకీయ చిత్ర పటాన్ని మనకందిస్తుంది. అపారమైన అధ్యయనం ఈ అక్షరరూపం. ఉద్యమకారులకు, విద్యావంతులకు ఈ గ్రంథాలు ఒక కరదీపిక. నూతన ఉత్తేజాన్ని నింపి మీ జీవిత మార్గంలో విజయపతాక ఎగురవేయడానికి స్ఫూర్తినిస్తుందని భావిస్తున్నాం. ఆలస్యమైనా అందుబాటులోకి తెచ్చినందుకు కత్తి పద్మారావుగారికి అభినందనలు.

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343

■ ఈ వారం కవిత్వం

కాపాడుకోవాలి

మోహన్‌రుషి

వాళ్ళెవరూ నీ వాళ్ళు కారని ఒకరోజున తెలిసొస్తుంది.
దిమ్మెర పోవడమంటే ఏందో అచ్చంగా అనుభవంలోకి వస్తుంది.
గొంతు దాటి రాలేక మాట మట్టి కరుస్తుంది.
కాళ్ళు, చేతులు సల్లబడ్తాయి.
చెట్టు కూడా ఎగిరిపోవాల్సిందే అనే పద్యపాదం గుర్తొస్తుంది.
ఏ ఆధారంతోఇన్నాళ్ళూ మనం వాళ్ళ చుట్టూ తిరిగామో అర్థం కాదు.
విలువిద్యలోని నేర్పరితనం అవాక్కయ్యేలా చేస్తుంది.
చూపుని శూన్యంలో వేలాడదీస్తుంది.

ఇక నిలబడక తప్పదనే సంకేతం నాడీ మండలానికి చేరుతుంది.
నిష్క్రమణ మాత్రమే నిజమైన వెలుతురుగా తోస్తుంది.
తప్పుకోవడమే తక్షణ చికిత్సగా
లోలోతుల్లోంచి మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

అడుగుల్లో వేగం హెచ్చి, ఆ బంధం నేలక్కొట్టి, ద్వారానికి దండం పెట్టి, నీ గుండెను నిలబెట్టావా? విడుదలై రేపటికి రెండు రోజులవుతుంది.

అలా బావుంటావు

ఆనందంగా వున్నప్పుడు నువ్వు వేరుగా వుంటావు. వేల వెలుగులు
విరజిమ్ముతుంటావు. అదేపనిగా నవ్వు మొహమవుతావు.
అపరిచితునితోనూ మాట్లాడ్తావు. ఎన్నడూ ఎత్తుకుని పాటవవుతావు.
రాని విజిల్‌నూ వేస్తావు.నడకలో కొత్త అడుగువవుతావు.
చేతిని దువ్వెనగా మార్చి జుట్టు పని పడ్తావు.
మొబైల్ ఫోన్ ఒకటుందన్న స్పృహ కోల్పోతావు.
సాయంత్రం సరాసరి ఇంటికే బయల్దేర్తావు.
తాగకుండానే ఎక్కిన మైకంలో తన్మయపాత్ర అవుతావు.
చుట్టుపక్కల్ని కూడా చూసేవాడివవుతావు.
ఆకస్మాత్తుగా జీవితం అధీనంలోకి వచ్చినట్లుగా తుళ్ళిపడ్తావు.
అవసరం లేకున్నా ఎందుకో మార్గమధ్యంలో ఆగి నిలబడ్తావు.
నీకు నువ్వే బ్రహ్మానందంగా తోస్తావు.
వెళ్ళిపోతున్న బస్సులోని చిల్లర ఇవ్వని కండక్టర్ని
పేద్ద దయామయునిలా క్షమిస్తావు
ఆనందంగా వున్నప్పుడు నువ్వు,
అమ్మకు చాలా దగ్గరగా కూర్చుంటావు.

కవి సెల్: 83417 25452

పొద్దు

నందకిషోర్

బర్రెలు రాతిరి మేసిన గడ్డిని
పక్కకు జరిపి పొదుగుని తడిపి
సుర్ సుర్ మంటు పిండిన పాలను
అమ్ముకరాగ పోరడు లేసె
చీపురు తీసి ఆకిలి ఊడ్చి
గడపలు కడిగి కుంకుమ బెట్టి
నీళ్ళను తోడి కల్లాపు చల్లగ
అమ్మలు అక్కలు ముందే లేసె.

పొద్దుటి కరెంటు మోటరు నీళ్ళతో
పొలాన్ని తడపగ పోయిన అయ్య
కాలువ గట్టున యాప పుల్లలు
ఇరుస్తు ఇరుస్తు ఇంటికి జేరే.
చివరాఖరికి లేసిన చెల్లెలు
ముగ్గు చిప్పలో ముఖం చూసుకుని
మూడు సుక్కల ముగ్గులు బెట్టి
పూలని తెంపగ పెరటికి నడిచె.

ఎండిన కమ్మల సందుల్లోంచి
ఎలుకలు తిరిగె వాసాల్లోంచి
గుడిసెల చేరిన యెలుగులు నాలుగు
మూడు బండల పొయ్యిని కలిసె
ఏరుకొచ్చిన పుల్లలు నాలుగు
అయ్య కొట్టిన కట్టెలు రెండు
అందులో జేరగ అన్నం ఉడికె
వార్చిన గంజి కడుపుల కురికె.

పచ్చడి మెతుకులు కలిపిన సద్దులు
గోనె సంచితో సుట్టిన బాటిలు
తట్టలబెట్టుకు మగనితో కూడి
అమ్మలు అక్కలు కూలికిబాయె.
వాలిన పొద్దుతో వచ్చిన కలలను
వలస వచ్చిన తెల్ల కొంగలను
హుష్ హుష్ అంటు పైకిలేపుతు
వడివడి అడుగులు వడిసెల విసిరె

బర్లని ఎడ్లని మందల మలిపి
గడిల బాయిలో ఈతలు కొట్టి
తీగలబూసిన కాయలు పండ్లతో
చిన్నపోరడు ఇంటికి వచ్చె
చంటి పిల్లలను చంకనెత్తుకొని
మూతలు పెంకులు మూట గట్టుకొని
సాయబానల చేరిన పిల్లలు
అమ్మ నాన్న ఆటలు ఆడె.

కవి సెల్: 87128 29212



మూడంతస్తుల గుహని చూశారా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. లెబనాన్ దేశంలో వున్న ఈ మూడు వంతెనల గుహ ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఇక్కడ డైనోసార్లు తిరిగాయంట. వర్షాకాలంలో బాగా కనిపించే ఈ జలపాతం మిగతా సమయాల్లో ఈ పర్వతం మీదున్న మంచు కరిగి చిన్న జలపాతంగా కిందికి ప్రవహిస్తుంది.



తొలి మంచుల్లో..

శీతాకాలం... తొలి పొద్దు... గిలిగింతలు పెట్టే చలిలో ఎప్పుడైనా ప్రకృతిలోని అందాల్ని ఆస్వాదించారా?.... మంచు దుప్పటి కప్పుకున్న ఆకులు, పూలు, చెట్లు, కొండలు... ఇలా ఒకటేమిటి? మంచులో తడిచి, మంచునే రక్షణ కవచంగా తొడుక్కున్న ప్రతిదీ ఆహ్లాదాన్ని పంచుతుంది.